శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!   సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



మీ మోహనమ్మైన రూపు
మన్మోహనమ్మైన మోము
నవమోహనమ్మై, ప్రసరించు చూపు
సమ్మోహనమ్మైన భాషణం...
మోదము గూర్చు ప్రవర్తనమ్ము..
మము ప్రగతిపథమున... మహితపథమ్మైన
సాయిపథమున... నిలుపునది
నడుపునది... కదా! స్వామీ!

జన్మదిన సంచిక

# గురుకృప

ప్రేమ-శ్రద్ధ, జీవితం-జీవనం

తీయటి పలుకులే ఆనాడు - కంటి చూపులే ఈనాడు - శ్రీకృష్ణదాసు



**సత్సంగం :** మా గురువుగారు నన్ను విద్యనగర్‌లో సత్సంగం చూసుకో మన్నప్పుడు ఆరు సంవత్సరాలుగా నేను ఒక్క సత్సంగం కూడా మానలేదు. వాకాడుకు, కోటకు మధ్య ఏరు ఒకటి ఉండేది. దానికి వరదలొచ్చినా నేను పడవలో దానిని దాటి సత్సంగానికి వెళ్లేవాడిని. నేనెప్పుడూ దానిని సాకుగా తీసుకుని సత్సంగం మానలేదు. నేను నాలుగైదు వారాలు వెళ్ళనిది ఒకే ఒక్కసారి - ఫ్రాండీలో ఉన్నప్పుడు. ఒక్కసారి చెన్నైలో రైల్వేవారి పరీక్ష వ్రాయడానికి వెళ్లాను. నేను ఉదయం చెన్నై వెళ్లి పరీక్ష వ్రాసి వెంటనే వచ్చి సత్సంగంలో పాల్గొన్నాను. 'ఇవాళ నాకు ఆ పని ఉంది. సత్సంగం స్కిప్ చేద్దాము' అని నేను ఏనాడూ అనుకోలేదు. మాస్టరుగారు నాకు అంత గొప్ప అవకాశం ఇచ్చారు. నేను అక్కడికి నా కోసం, నా బాగోగుల కోసం వెళతాను.

అక్కడ జనం నన్ను పిచ్చివాడి క్రింద జమకట్టేవారు. "ఏమిటి ఇతనికి పిచ్చా? మరీ అంత పట్టుదల ఏమిటి? సత్సంగం పట్ల మరి అంత సీరియస్‌గా ఎందుకుంటాడు? పడవ కట్టించి వరదలో ఉన్న నదిని కూడా దాటి సత్సంగానికి వస్తాడేమిటి?" అని. వారి దృష్టిలో నేనొక మూర్ఖుడినే. నేను ఆ నియమం పెట్టుకున్నాను. ఏ రోజైనా వెళ్ళకపోతే ఏదో కోల్పోతానని అనిపించేది. నా నియమాన్ని నేను పాటించాలి గదా! - **శ్రీబాబూజీ**

సంపుటి : 16
జనవరి 1

# గురుకృప

సంచిక : 1
2013



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

\- శ్రీబాబూజీ



## లోపలి పేజీలలో

ఇదీ మన జీవితం 4
\- గురుకృప

ఎరుక మరపుల హేల 5
\- శరశ్చంద్రికలు

పనిచేయడమే నీ వంతు 11
\- పార్థసారథి ప్రవచనాలు

చేస్తే అలా చెయ్యి 17
\- అక్షరాల్లో అనుభూతులు

చిరునవ్వులు - చిరుదివ్వెలు 21
\- గురుకృప

అనుభవ సుధామాలిక 25
\- గురుబంధువులు

నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**

GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778

Printed at : Ramakrishna Printers, Visakhapatnam.



# ఇదీ మన జీవితం

ఆధునిక జీవితంలోని వైరుధ్యాలపై వివరణ. ఎత్తైన భవనాలు-చిన్న మనసులు, విశాలమైన దారులు-సంకుచిత స్వభావాలు, ఖర్చుఘనం-సంతృప్తి స్వల్పం, ఎక్కువ వస్తువులు-తక్కువ ఆనందం, పెద్ద ఇళ్లు-చిన్న కుటుంబాలు, సౌఖ్యాలు అపారం-సమయం పరిమితం. ఎన్నో డిగ్రీలు- కొంతే ఇంగితం, ఎంతో విజ్ఞానం- కొంతే వివేకం, నిపుణులు అపారం- సమస్యలు నిరంతరం. ఎన్నో మందులు- ఆరోగ్యం కొంతే, తెగ తాగేస్తాం-సిగరెట్లు ఊదేస్తాం. బలాదూర్లు తిరగేస్తాం-అయినా ఆనందాన్ని అందుకోలేం. లేటుగా పడక-లేస్తూనే అలసట. చదివేది శూన్యం-టివితోనే బంధం-దేవునితో అనుబంధం శూన్యం.

ఆస్తులు పెరుగుతున్నాయి-విలువలు తగ్గుతున్నాయి, వాగుడు ఎక్కువ-ఆలోచన తక్కువ. ప్రేమించే మనసు మోడువారింది-పరనిందకు మాత్రం సిద్ధం. ఎలా బతకాలో తెలుసుకొని నిండుగా బతకలేక పోతున్నాం. వయసు పెరిగితోంది-గుండె తరుగుతోంది. చందమామను అందుకుంటాం- మనవీధి దాటి పొరుగువీధిలో వున్న బంధువులను కలిసే తీరిక లేదంటాం. ప్రపంచమంతటినీ జయించాం-మనో ప్రపంచాన్ని జయించలేకపోయాం. ఘనమైన పనులు చేసాం - మంచి పనులు చేయలేకపోయాం. గాలిని శుభ్రపరిచాం- ఆత్మను కలుషితం చేసాం. అణుబాంబుని చేసేంతగా ఎదిగాం- మూఢత్వాన్ని వదులుకోలేం. ఎక్కువ రాస్తాం- తక్కువ చదువుతాం. ఎన్నో ప్రణాళికలు వేస్తాం- కొంతే సాధిస్తాం. పరుగులు తీస్తాం- ఒక్క క్షణం వేచి చూడలేం, కుప్పలు కుప్పలుగా సమాచారం-మాట్లాడేందుకు మనిషే కరువు.

బర్గర్లు, పిజ్జాలు తింటూ ఆనక అరగక అవస్థ పడతాం, భారీకాయం, సౌశీల్యం లేశమాత్రం. లాభాల కోసం పరుగు, బంధాలు కనుమరుగు. నాలుగు చేతుల ఆదాయం, పెళ్లయిన మూణ్ణాళ్లకే విడాకుల పర్వం. అన్ని హంగులతో ఇల్లు, మనుషులు లేక బోసిపోయే లోగిళ్ళు, కళ్ళు తిరిగే సాంకేతికం- అయినా భావదారిద్ర్యం. ***వస్తువుల్ని ప్రేమిస్తూ మనుషుల్ని వాడుకునే స్థాయికి దిగజారాం.*** అనైతిక తిరుగుళ్లు, ఆత్మహత్యలకు ఆనవాళ్లు. ఇదేనా జీవితం? కాదు... మరేది జీవితం?

ప్రియభావాలతో, ప్రియమైన వ్యక్తుల మధ్య కాలం తెలియకుండా గడుపుదాం. కష్టాలలో వున్నవారికి ఆప్తవాక్యం పలుకుదాం. పొరుగువారిని ప్రేమిద్దాం. ప్రేమకు, ప్రేమనిండిన మాటకు, కలబోతకు, సమయాన్ని కేటాయిద్దాం. జీవితాన్ని మనం ఎన్నిసార్లు ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు తీసుకున్నాం అనేదానితో కొలవలేం. ఆనందంతో ఊపిరి తీసుకోవడం మరచిపోయిన క్షణాలెన్ని గడిపాం అన్న దానితో కొలుస్తాం కాబట్టి నిజంగా జీవిద్దాం.

**అర్థవంతంగా చేస్తే ఏదైనా సరి అయినదే - అన్నింటి ఉద్దేశ్యమూ అదే - శ్రీబాబూజీ.**



జీవితాన్ని భగవంతుని సేవా యజ్ఞంలో సమిధిగా భావించారు, అలా జీవించారు, ఒకప్పటి తరంవారు. జీవితం అంటే భగవత్ ప్రసాదంగా భగవత్ కైంకర్య వస్తువుగా శ్రద్ధగా, బాధ్యతగా, అపురూపంగా, పూజాపుష్పంగా పవిత్రంగా కాపాడుకున్నారు, వాడుకున్నారు. క్రమేణా మనిషి భావజలంలో తేడాలొచ్చి ఆ రీత్యా జీవన విధానం మారిపోయింది. వస్తువుల్ని ప్రేమిస్తూ - మనుషుల్ని వాడుకునే స్థితి దాపురించింది. ఎప్పుడైతే జీవిత ప్రయోజనంలో మార్పు వచ్చిందో దాని విలువలు పడిపోయాయి. (నైవేద్యానికున్న విలువ తినుబండారానికి ఉండదు. ప్రసాదం లభించగానే మనవారితో పంచుకోవాలనే భావం - అదే బందరు లడ్డయితే గభాలున గుటుక్కుమనిపించేస్తాం) పూజాపుష్పానికున్న విలువ అలంకార కుసుమానికి ఉండదు. సహజ సుమానికున్న పరిమళం-కృత్రిమ కుసుమానికి ఉండదు. అలా పరిమళ సుగంధ భరిత జీవితాన్ని ఆస్వాదిస్తూ పదుగురికి పంచుతూ కృత్రిమత్వాన్ని , యాంత్రిక జీవనానికి చరమగీతం పాడదాం... సహనాన్ని సహజస్వభావంగా, శ్రద్ధను స్వరూపంగా మలచి బాబాకి అర్పిద్దాం. అలా జీవించే ప్రయత్నం సాగిద్దామనే సంకల్పం ఈ నూతన సంవత్సరంలో మన ఒక అడుగైతే - బాబా గురూజీల పదిఅడుగులు వేసి అనుగ్రహిస్తారన్నది సత్యం.

**- జార్జికార్లిన్**

## శరచ్చంద్రికలు

## ఎరుక మరపుల హేల - *డిసెంబర్ 2012*

**భక్తుడు :** నేను జ్ఞాపకశక్తి గురించి అడగాలనుకొంటున్నాను. నాకు జ్ఞాపకశక్తి బాగా తగ్గుతున్నదని అనిపిస్తున్నది. ఇది అప్పుడప్పుడు నాకు బాగా ఆందోళన కలిగిస్తోంది. జ్ఞాపకశక్తి ఇంతగా తగ్గడానికి వయస్సు మళ్లడం కాకుండా మరే ఇతర కారణమేదైనా ఉందా? ముఖ్యమైన, అవసరమైన విషయాలను నేను గుర్తుపెట్టుకోవడమెలా? నేను పరధ్యానాన్ని తగ్గించుకొని పూర్తి ఎరుకతో ఉండడం ఎలా?



**గురువుగారు :** దానిని సరిదిద్దుకోవడానికి ప్రయత్నించు. నువ్వు కొన్ని విషయాలను మర్చిపోతున్నావంటే నువ్వు నా దగ్గర ఉన్నావన్న సంగతి కూడా మర్చిపోవచ్చు. స్టవ్ మీద పాలు (కాగడానికి) పెట్టావన్న విషయం

మహాత్ముల దర్శనం, స్పర్శనం, సంభాషణం, వందనం ఇవి ఒకటి కంటే ఒకటి ప్రయోజన కరమైనవని చెబుతుంది శాస్త్రం. మహాత్ములను ప్రత్యక్షంగా దర్శించడం, వారితో సంభాషించడం, వారి స్పర్శ లభించడం, వారికి వందనమాచరించడం ఇవన్నీ ఆయన అనుగ్రహరూపాలే. ఇదంతా ఆయన కృపే, కరుణే, దయే.

**ప్రభోదాత్మకాలు - మహాత్ముల లీలలు -శ్రీబాబూజీ.**



మరచిపోయావంటే అది వేరే విషయం – కానీ నువ్వు ఇక్కడ, నా సమక్షంలో ఉన్నావన్న విషయాన్ని గుర్తుంచుకుంటున్నావా? దీనిని గనుక మనం మర్చిపోతే మిగతా విషయాలను కూడా మర్చిపోతాం. యావత్ ఆధ్యాత్మికసాధన, సాధనాపద్ధతులు... అవి ఏవైనా కానివ్వండి, అవన్నీ కూడా రకరకాల మార్గాలలో మన జ్ఞాపకశక్తిని మెరుగుపరచుకోవడానికి చేసే ప్రయత్నాలే. అవి స్మరణ కోసం చేసే అభ్యాసాలే. ఉదాహరణకు ... నువ్వు నామాన్ని జపిస్తున్నావంటే, ఏం చేస్తున్నట్లు? నువ్వు (నామాన్ని) గుర్తుచేసుకుంటున్నావు. నామాన్ని నీవు జ్ఞాపకముంచుకోవడానికి, మనస్సు నామాన్ని మరచిపోకుండా ఉండేలా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నావు. ఆత్మవిచారణ విషయంగానైతే 'నేనెవరు? నేనెవరు? నేనెవరు?' అనే అసలైన విచారణను మరచిపోకుండా ఉండేలా చూసుకుంటూ, ఒకవేళ మనం మరచిపోతే మళ్లీ మనస్సును తిరిగి ఆ విచారణ మీద నిలుపుతాము. ఆధ్యాత్మిక సాధనాలుగా పిలువబడేవన్నీ – అవి ఏవైనా కానివ్వండి – మన జ్ఞాపకశక్తిని మెరుగుపరచడం కోసం ఉద్దేశింపబడినవే.

**భక్తుడు** : అలా అయితే ప్రయత్నం అవసరమే మరి?

**గురువుగారు :** అవును. గుర్తుంచుకోవడమన్నది అప్రయత్నంగా జరుగకపోతే, ప్రయత్నం అవసరం. అప్రయత్నంగా గుర్తుంచుకోగలిగితే, అప్పుడు సమస్యే లేదు! ఇంకా నువ్వన్నట్లు కొంతవరకు, కొన్ని చిన్న చిన్న విషయాలలో వయస్సు మళ్లడం మరపుకు కారణమవుతుంది. కానీ ఉన్న కారణాలలో అది కేవలం ఒకటి మాత్రమే. అది చిన్నా చితకా విషయాలకు మాత్రమే వర్తిస్తుంది కానీ చాలా ముఖ్యమైన విషయాలకు కాదు. మనం మరచిపోవడమన్నది అసలు జరుగకూడదు. మరపు మంచిది కాదు. ఆధ్యాత్మిక జీవితాన్ని గడిపే చాలామంది తాము 'ఆత్మధ్యానం'లో ఎంతగానో లీనమైపోయినందున ప్రాపంచిక విషయాలను మరచి పోయామనుకుంటారు. అది నేను అంగీకరించను. అదంతా ఒట్టి బూటకం (నవ్వులు)

మనకు ఆసక్తి ఉంటే, మనకు ప్రేమ ఉంటే, ఎరుక ఉంటే – మనకు జ్ఞాపకశక్తి కూడా ఉంటుంది. నేను చెప్పినట్లు వృద్ధాప్యం కూడా కొంతమేరకు కారణమవుతుంది. కానీ, అది కేవలం చాలా చిన్న విషయాలకు మాత్రమే వర్తిస్తుంది.

**భక్తుడు** : కానీ, మనం మన ఆధ్యాత్మిక సాధన మీద లేదా మనకు ఇష్టమైన లక్ష్యంమీద దృష్టిని పెట్టినపుడు, దానివలన మనం మిగతా విషయాలను మరింతగా మరచిపోవడం జరుగదా?

**గురువుగారు :** నిజానికి, నువ్వు దేనినీ మర్చిపోకూడదు. కానీ నీకు కొన్ని విషయాలు మాత్రమే గుర్తుంటున్నాయి – నీకు గుర్తుండే విషయాలపట్ల నీ అనుభవం సరైన రీతిలో ఉండి ఉంటుంది. మిగతా విషయాల పట్ల నీ అనుభవం సరైన పద్ధతిలో ఉండదు.

**భక్తుడు** : అయితే మరి దానికి విరుగుడు ఏమిటి?



**గురువుగారు :** నువ్వు ఆ ఎరుకను పెంచుకోవడమే. ఇప్పుడు నువ్వు నా దగ్గర ఉన్నావు. నువ్వు నా వద్ద ఉన్నావన్న విషయాన్ని మనస్సులో ఎప్పుడూ నిలుపుకోగలిగితే, అప్పుడు ఈ ఎరుక, ఈ సాధన – దానిని నువ్వు ఏమని పిలిచినా సరే – అది నిన్ను మిగతా విషయాలను గుర్తుంచుకునేలా చేస్తుంది. నువ్వు దీనినే గుర్తుంచుకోలేకపోతే, మిగతా విషయాలను ఎలా గుర్తుపెట్టుకోగలవు? మనం బుర్రను ఎప్పుడూ అన్ని విషయాలతో నింపుకోవడానికి ప్రయత్నించాలని కాదు! ఆ అవసరం లేనేలేదు! నువ్వు ప్రతి విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని నేను అనడం లేదు. కానీ మనకు ఆ ఎరుక ఉన్నపుడు (ఏ విషయమైనా) అవసరమైనపుడు గుర్తుకు వస్తుంది. జ్ఞాపకం ఉంటుంది. దేనినీ ప్రయత్నపూర్వకంగా గుర్తుంచుకోవాల్సిన అవసరం లేదు. మనలోని ఎరుక, మన స్వభావం నిశ్చలంగా ఉంటే, మన ఎరుకలో ఏదైనా విషయం జరిగినపుడు మనం దానిని తక్షణమే అక్కడితో వదలివేయ గలుగుతాము. అవసరమైనపుడు అది మళ్లీ గుర్తుకు వస్తుంది. మనం దానిని జ్ఞాపకం చేసుకోగలం. మన మరపుకు కారణ మేమిటంటే, ఏదైనా విషయానుభవాన్ని పొందుతున్నపుడు మన ఎరుక సరైన స్థితిలో ఉండదు. మనం సరైన పద్ధతిలో విషయాలపట్ల గమనింపుతో ఉంటే, అవి మనకు జ్ఞప్తికి రావాల్సినపుడు జ్ఞాపకం వస్తాయి.

**భక్తుడు :** దానికి సరైన పద్ధతి ఏమిటి?

**గురువుగారు :** మనం ఇక్కడ ఎందుకున్నాం అనే విషయాన్ని గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నించండి. మనం ఏం పొందుతున్నాం? మనం ఇక్కడకు ఎందుకు వచ్చాం అని చెబుతున్నామో దానికి తగినట్లుగా మన ఆచరణ ఉందా? ఆ అనుభవాన్ని ఇంకా గొప్పగా అనుభూతి చెందడానికి, ఇంకా గొప్పగా వ్యక్తం చేయడానికి మనం ఎటువంటి మార్గాలలో ప్రయత్నించాలి? (ఈ విషయాలను గుర్తుపెట్టుకోవడానికి ప్రయత్నించండి)

భాగవతంలో బలిచక్రవర్తి "చుట్టాలు, దొంగలు, సుతులు, ఋణస్థులు" అందరూ ఏదో పని వుండే మనను సమీపిస్తారు" అన్నారు. ఇది తెలిసిన మా తాతగారైన ప్రహ్లాదుడు తండ్రిని కాదని మిమ్ము శరణుపొందాడు. మా పూర్వీకులందరూ నిన్ను అదికావాలి, ఇది కావాలి అని అడిగారు. ఇవాల్టికి మీరు నన్ను మూడు అడుగులు కావాలని అడుగుతున్నారు. ఇది నా భాగ్యం కాక ఇంకేమిటి? అని ఆయన కోరింది ఇచ్చి చరితార్థుడయ్యాడు బలిచక్రవర్తి.

మొదటి రెండు పాదాలతో వారు అంతటా నిండిపోయారు. మూడవ అడుగుకి తన తల ఒగ్గడం ఆయన చెప్పిన సాధన చేయడమేనేమో! దీనికి మనం బాధపడితే లోనికి తొక్కుతున్నట్లు అనుకుంటే మనది సంకుచిత దృష్టే. మన అహంకారాన్ని తొలగిస్తున్నట్లు, నిర్మూలిస్తున్నట్లు తెలుసుకుంటే ఆనందం, జగత్కళ్యాణ కారకుడు భగవంతుడే" అన్నదే 'ఎరుక'



మనం ఇక్కడకు గురువుగారి కోసం వచ్చామని చెబుతున్నాం. మనం ఆయన చెంతనే ఉంటున్నాం. మరి రోజంతా ఏం చేస్తున్నాం? రోజును ఎలా గడుపుతున్నాం? ఏదో జాకెట్‌నో, స్కర్ట్‌నో కొనాలని మనం షాపింగ్‌కు (బజారుకు) వెళతాం, మొత్తం మార్కెట్‌నంతా గాలిస్తాం, అక్కడి కాలుష్యం వంటి వాటివల్ల బాగా అలసిపోతాం. రోజంతా ఇలా తీరుబడి లేకపోవడం వలన కొంతమంది 8 గంటల ఆరతికి, కనీసం ఊదీ తీసుకోవడానికి కూడా రారు. రోజంతా వాళ్లు "తీరుబాటు" లేకుండా ఉన్నారు కదా మరి. మీరు ఇక్కడకు వచ్చినపుడు ఏం చేస్తున్నారు? నా దగ్గర ఉండటమంటే కేవలం నా ఎదురుగా కూర్చోవడమేనా? ఇంతకుముందు ఆదిశంకరుల సాక్షాత్కారం గురించి, హృదయనేత్రంతో చూడడం గురించి అడిగారు. మీకు నిజంగా అటువంటి సాక్షాత్కారం పట్ల ఆసక్తి ఉంటే, మీరు ఇక్కడ కూర్చున్నపుడు, నేను మేడమీదనో, లేక ఇక్కడే దగ్గరలో ఉన్నాననే ఎరుక మీకున్నపుడు – మీదైన పద్ధతిలో మీరు ఆ సన్నిధిని అనుభూతి చెందడానికి ప్రయత్నించండి. మనం అది చెయ్యం. దానికి బదులు పిచ్చాపాటీ మాట్లాడుకుంటాం. అలా మౌనంగా కూర్చుని, సన్నిధిని అనుభూతి చెందడానికి ప్రయత్నించేవారిని నేను చాలా అరుదుగా చూస్తుంటాను. చాలా చాలా కొద్దిమందిని మాత్రమే చూస్తుంటాను.

నాతో మీకు గల అనుబంధాన్ని కేవలం ఈ అరగంటకో, అయిదు నిమిషాలకో లేదా ఓ గంటకో పరిమితం చేయకండి. దాన్ని మరింత విస్తృతం చేసుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడు మీరిక్కడ ఎందుకున్నారు, ఏం చేయాలి అన్న విషయం అవగతమవుతుంది. ఏ విషయాన్నైనా మీరు సంపూర్ణంగా అనుభవించగలిగేటట్లు, అది జరిగిపోయిన తక్షణమే దానికి సంబంధించిన ఎటువంటి చిహ్నాలు మనసులో లేకుండా ఉండేటటువంటి మనఃస్థితిని సాధించడానికి ప్రయత్నించండి.

**గురువుగారు :** ఇక్కడ ఉండటాన్ని ప్రతి నిమిషమూ అనుభూతి చెందడానికి ప్రయత్నించండి. అలా కూర్చుని దానిని అనుభూతి చెందడానికి ప్రయత్నించండి. పాలనుగాని, నీళ్లనుగాని, కాగబెట్టడానికి మీరేం చేస్తారు? వాటిని స్టవ్‌మీదనో, మంటమీదనో పెడతారు. ఆ మంట యొక్క వేడి వాటికి తగులుతుంది. ఆ మంట మీకు తగలాలని మీరు నిజంగా అనుకుంటే స్టవ్ మీద ఉండటానికి ప్రయత్నించండి! పాలను ఫ్రిజ్‌లో పెట్టి స్టవ్ వెలిగిస్తే అవి ఎలా కాగుతాయి? (నవ్వులు)

మన దృష్టి ఆ సన్నిధిమీద, ఆ ఎరుకమీద ఉన్నంతకాలం, మనకు జ్ఞప్తి ఉంటుంది. మీరు స్టవ్ మీద పాలు పెట్టారన్న సంగతి మర్చిపోయినా, మర్చిపోకపోయినా ఏం మునిగిపోదు. కానీ ఇక్కడ దీనిని (సన్నిధిని) మాత్రం మర్చిపోవద్దు. దీనిని గుర్తుంచుకోండి. మీకిది గుర్తున్నంతవరకు ఇబ్బంది లేదు. దీనిని ఎప్పుడూ మనస్సులో ఉంచుకోవాలి. మీరు దానిని గుర్తుపెట్టుకుంటే మీకు మిగతావన్నీ గుర్తుంటాయి.



ఇది మర్చిపోతే, మీరు వాటినీ మర్చిపోతారు. ఒక శాస్త్రంలో "మరపే మరణం" అని ఓ మహర్షి అన్నారు. మరణం అంటే ఏమిటి? అంటే, దానికాయన "మరపే మరణం" అన్నారు.

మనం జీవిద్దాం, అలాంటి మరణం నుండి తప్పించుకుందాం, మనం ఎక్కడున్నాం, మనం ఏం చేస్తున్నాం, మనం ఏం సాధించాలనుకుంటున్నాం, మనం ఏం పొందుతున్నాం, మనం ఏం పొందడం లేదు, మనం పొందలేని దానిని పొందడానికి మనం ఏం చేయాలి – ఈ విషయాలపట్ల పరిపూర్ణమైన ఎరుకతో ఉందాం. మనం చేసే పనులన్నీ, మన మార్గాలన్నీ, మన చేతలన్నీ, మన మాటలన్నీ దానివైపుకు మరల్చి దానినే గమ్యంగా చేసుకుందాం. అలా అయితేనే మీరు ఇక్కడ ఉండటానికి ఏ మాత్రమైనా సార్ధకత, ప్రయోజనం ఉంటుంది.

**గురువుగారు :** నేను మీకో విషయం చెబుతాను. నేనిప్పుడు మీతో మాట్లాడుతున్నాను. నా మాటల్ని మీరు వింటున్నారు. నేను మాట్లాడటం ఆపగానే మీరు సముద్రపు ఘోషను  వింటారు మీరు. "ఓс ఈరోజు సముద్రం చాలా అల్లకల్లోలంగా ఉంది" అంటారు, లేకపోతే గాలి సవ్వడినో, కుక్క మొరగడాన్నో, ఇంకా ఎవరో దగ్గడాన్నో వింటారు. కానీ నేను మాట్లాడుతున్నపుడు మీరు ఆ విషయాలను గమనించరు. మీరు చేసే పనులన్నీ మీరు వింటున్న నా మాటల మాదిరిగా ఉండాలి. మీరు ఏదో ఒక పని చేస్తున్నంతవరకు, అది స్టవ్ మీద పాలు పెట్టడం కావచ్చు, లేదా మరేదైనా కావచ్చు. అది మీరు నా మాటలు వినడం

## ఆధ్యాత్మికతే శరణ్యం

ఫలాపేక్ష లేకుండా మామిడి మొక్కలు నాటుకుంటూ పోయే వ్యక్తులు ప్రతి సమాజానికి  కావాలి. (నీవు ఎన్నో మహావృక్షాలను నాటాలి అని బాబా ఉపాసనీతో అన్నమాటలు) మన దేశానికి గొప్ప బలంగా భావించే ఈ గుణమే ఇప్పుడు లోపిస్తుంది. ఈ లోపమే మనం చవిచూసిన పతనాలలోకెల్లా పెద్ద పతనం. ఈ సృష్టిలోని ఓ విభిన్న కోణానికి ప్రతిరూపమై, జగతికి వరంగా భాసిల్లే వివేకానందుడు "దరిద్రో నారాయణో హరి అన్న మాటలు" గౌతమబుద్ధుడు వంటి ఆదర్శమూర్తులను తయారు చేసుకోలేకపోవడమే పెద్ద పతనం.

గతంలో సమాజంలో ఆధ్యాత్మికత ఉన్నవారు కొద్దిమందే ఉండేవారు. మిగిలినవారు వారి వద్ద ఆశీర్వాదం కోసం వెళ్లేవారి జీవితాలను నిలబెట్టుకునేవారు. ఇవాళ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఉపకరణాలతో స్వీయ ముప్పు కొనితెచ్చుకుంటున్నాం. ఈ కారణంగా సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరచుకుంటే తప్ప మనుగడ సాగించలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడున్న సాధనా సంపత్తి సామర్థ్యంతో మొత్తం సర్వ నాశనం చేయడానికి ఒక్క మూర్ఖుడు చాలు. (ఇక్కడ పైథాగరస్ చెప్పిన మాటలను మననం చేసుకుందాం. నీవు మరణించేలోపు ఒక్క మూర్ఖుడినైనా మార్చు... ఆ ఒక్కడు నీవే) ఇలాంటి కీడు తలపెట్టడానికి చాలామంది మూర్ఖులు పోటీ పడుతున్నారు. కాబట్టి ఆధ్యాత్మికత అన్నది ఇంకెంత మాత్రము కొత్తదనం కోసం పరితపించే వస్తువు కాదు. మన మనుగడ కోసం, ఈ భూగ్రహ మనుగడ కోసం (ఈ భూగ్రహమే భూగృహంగా భావించే మనస్తత్వం కావాలి) తప్పని సరి అవసరం.

**– సేకరణ : గురుకృప**



మాదిరిగా ఉండాలి. మీ ఎరుక ఎప్పుడూ అలా ఉండాలి. మీరు ఏమీ చేయకుండా ఊరకే ఉన్న తక్షణం మనస్సు నిరంతరం ఉన్న సముద్రపుఘోషను వింటూ, దానిమీద నిలవాలి. ఆ శబ్ధం ఎప్పుడూ ఉంది. కానీ మీరు దానిని ఆలకించడం లేదు. మీకు అది వినిపిస్తునే ఉన్నా, నేను మాట్లాడటాన్ని మీరు ఆలకిస్తున్నారు. నా మాటలు వినడం ఆపగానే, మీరు సముద్ర ఘోషను – హృదయంలోని మౌనాన్ని, ఆ ఆనందాన్ని, ఆ ప్రేమను వింటారు, ఆలకిస్తారు. ప్రేమ యొక్క పులకరింత సముద్రపుఘోష లాంటిది. మీకది ప్రతిక్షణం వినిపిస్తూనే ఉంది, మీరు చేసే పనులన్నీ దానిమీదనే ఆధారపడి ఉన్నాయి. మీరేదైనా పనిలో నిమగ్నమైతే – ఇప్పుడు నా మాటలు వింటున్న మాదిరిగా – మీరు ఆ పనినే చెయ్యాలి. ఆ పనిని ఆపిన తక్షణం, మీరు సముద్రఘోషను వినగలగాలి.

ప్రతిక్షణాన్ని పూర్తిగా అనుభూతి చెందడానికి ప్రయత్నించండి. నెమరువేస్తూ ఉండవద్దు – హడావుడిగా గడ్డి తినేసిన ఆవులలాగా, గేదెలలాగ మనం విషయాలను నెమరువేసుకుంటూ ఉండవద్దు. ఆవులు, గేదెలు ఏం చేస్తాయి? తరువాత గడ్డి దొరకదని భయపడి వేరే పశువులు వచ్చి తినడానికి ముందే ఆబగా తినేసి, తరువాత నెమ్మదిగా దానిని వెనక్కి తెచ్చుకొని నెమరువేసి జీర్ణం చేసుకోవడానికి ప్రయత్నిస్తాయి. మనకున్న ఆలోచనలు, ఆందోళనలు, భయాలు, చీకాకుల వల్ల మనమూ అలానే చేస్తుంటాం. ప్రపంచంలో విషయాలపట్ల మన అనుభవం గేదె గడ్డి తిన్నట్టుగా ఉంటుంది. ఆపైన మనం ఒంటరిగా ఉన్నప్పుడు, మనం గమ్మున కూర్చున్నప్పుడు వాటిని వెనుకకు తీసుకొని వచ్చి నెమరువేసుకుంటూ జీర్ణం చేసుకోవడానికి ప్రయత్నిస్తాం. గేదెల్లాగానో, ఆవుల్లాగానో బ్రతకవద్దు (ఆహారాన్ని) సంపూర్ణంగా నమిలి తినే మనిషిలా జీవించండి. **(ప్రతిక్షణాన్ని) ఆ క్షణంలో పరిపూర్ణంగా అనుభూతి చెందడానికి ప్రయత్నించండి.**

**భక్తుడు :** ఈ నెమరువేసుకునే అలవాటును పోగొట్టుకోవడానికి దగ్గరదారి ఏదీ ఉన్నట్లు కనిపించడంలేదు.

**గురువుగారు :** దానిని దూరమైన దారినే తీసుకోనివ్వండి. ఏం సమస్య లేదు (నవ్వులు)

**భక్తుడు :** అలా అయితే అది చాలా సుదీర్ఘమైన ప్రక్రియ, అది సంవత్సరాల తరబడి కొనసాగవచ్చు.

**గురువుగారు :** నిజానికది అంత సుదీర్ఘమైన విషయం కాదు. ఎందుకంటే మీకు సన్నిధి ఉంది, మీ చెంత సముద్రం ఉంది. ఒకవేళ మీరు మరచిపోయినా మీరు చేయాల్సిన ప్రయత్నమంతా దానిని గుర్తుచేసుకోవడమే. ఎందుకంటే సన్నిధి, సముద్రం ఎప్పుడూ ఉన్నాయి. ఆ సముద్రఘోషను, ఆ భావాన్ని మీరు కల్పించుకోవాల్సిన అవసరం లేదు – అది ఉంది. దానిమీద దృష్టి ఉంచడమనే ఆ ఒక్క విషయాన్ని మీరు చెయ్యడం లేదు. కనీసం మీరు ఇక్కడ సముద్రం వద్ద, సముద్రపు ఒడ్డున ఉన్నప్పుడైనా, దానిని వినడానికి ప్రయత్నించండి. **మీరు ఏం చేసినా, ఏం మాట్లాడినా ఆ మరుక్షణం వాటి జాడలు మీ మనస్సు మీద ఉండకూడదు.** మీరు ఆ ఎరుకతో ఉన్నట్లయితే ఆ తరువాత ఏ పనైనా చెయ్యాల్సిన అవసరం వచ్చినప్పుడు మీరు దానిని నిర్ధిష్టంగా చేస్తారు – ఈ ఘోష మీ జ్ఞాపకశక్తిని ప్రభావితం చెయ్యదు. మీరు పనిచేసినప్పుడు పనిచేస్తారు.



మీరు అలా నిశ్చలంగా ఉన్నప్పుడు నిశ్చలంగా ఉంటారు. మీరు నిశ్చలంగా ఎప్పుడుంటారు? మీరు దానిని (సన్నిధిని) అనుభూతి చెందితే, ఈ మంట అంటుకుంటే ఆ నిశ్చలత్వం వస్తుంది. ఆ మంట అంటుకోవాలంటే ఆ మంటకు దగ్గరగా ఉండాలి. మంట చుట్టు ప్రక్కలే ఉండాలి. మీ మార్గంలో దానిని ప్రయత్నించండి. మీ పద్ధతులను, విధానాలను మీరే వెతుక్కోండి. నా దగ్గర ఒక ప్రత్యేకమైన పద్ధతి అంటూ ఏమీ లేదు. ఎందుకంటే, బయట వేల, లక్షల పద్ధతులున్నాయి. వాటన్నింటికీ ఎరుకతో ఉండటమనేదే లక్ష్యం. అప్పుడు మిమ్మల్ని ఏదీ కదిలించలేదు, ఏదీ మీ హృదయంలో దుఃఖాన్ని కలిగించలేదు. ఆ దుఃఖం మనల్ని బాధించడానికి, మన ముందుకు రావడానికే భయపడుతుంది. అది విఫలమవ్వాల్సిందే. అప్పుడు మన జీవితానికి ఒక అర్థముంటుంది.

## పని చేయడమే నీ వంతు!

కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన ।

మా కర్మఫల హేతుర్భూర్మాతే సంగోస్త్వ కర్మణి॥ (2అ॥47శ్లో॥) – గీత

మానవునకు పనిని చేయుటయందే అధికారమున్నది. ఫలితమును నిర్ణయించుటలో అతనికి అధికారం లేదు. కర్మఫలానికి తాను హేతువుగా నిలబడుట కూడా మంచిది కాదు. ఇన్ని ఆంక్షలు ఉన్నాయి కదా అని పని చేయడమనే పవిత్రస్థితి నుండి ఎన్నడూ తప్పుకొనరాదు. అలాంటి ఆలోచన కూడా మనస్సున రారాదు. పని మన నుండి జరుగుతూ ఉండవలసినదే. దైవం మనకు **శరీరాన్ని** ఇచ్చాడు, కర్మాచరణకు కావలసిన **కర్మేంద్రియాల**నిచ్చాడు. ఈ రెండు గుంపులచేత పని చేయించగలగిన **మనస్సు**ను ఇచ్చాడు. పని చేయిస్తున్న మనస్సునకు కావలసిన సూచనలిచ్చేటందుకు **బుద్ధి**ని ఏర్పాటు చేసాడు. ఇలా మనలో కర్మాచరణలకు కావలసిన బలగమంతా రూపొందింప బడివుంది. ఇక కర్మాచరణం జరగడమే తరువాయి. కర్మాచరణమెలా జరుగుతున్నది ఆపైన 'తాను' ప్రశాంతంగా నిలబడిచూస్తూ ఉంటాడు. అలా మనలో నిలబడి మన కర్మాచరణాన్ని గమనిస్తున్న దైవాన్ని సాక్షీమాత్రుడు అంటారు. స+సాక్షి= సాక్షి. కన్నుగలిగినవాడు. మన ప్రవర్తనను నిరంతరం గమనించగలిగిన కన్నుగలవాడు మనలోనే, ఆ లోపల, ఆ మూలసౌధంలో ఉన్నాడు.

పని చేయడానికి కావలసిన బలగమంతా ఈయబడింది కాబట్టి మానవునికి పనిచేయడంపైన అధికారమీయబడినట్లయింది. అనగా మనం పనులు చేసి తీరవలసిన స్థితిలో పెట్టబడ్డాము. కొందరికి అది ఇబ్బందిగా అనిపించవచ్చు. కొందరికి అది అవకాశంగా అనిపించవచ్చు. మొత్తంమీద మానవులు పనిచేసితీరాలి. అయితే ఫలితాన్ని గూర్చి అతడు ప్రశ్నించకూడదు. ఫలితం ఇలా ఉంటే బాగుంటుందని దేవుడికి ఉచిత సలహా ఈయకూడదు. కోరిన ఫలితం లభిస్తేనే మేం పనిచేస్తాం. లేకపోతే చేయము. మేము కోరిన ఫలితం రానపుడు మేమెందుకు చేయాలి? ఎవరిని కోరి ఈ పనిని ప్రారంభిస్తున్నామో, ఆ



దేవుడే మమ్మల్ని కాదు పొమ్మన్నాడు. కనుక అతనికి మహిమ లేదంటాము. ఉంటే మేమాశించిన ఫలితం రావాలి కదా, అని మడత ప్రశ్న వేస్తూ ఉంటాం. అలాంటి మొండివేషాలు వేయకూడదు. ఆశించిన ఫలితం రాలేదని కృంగిపోయేవాళ్ళుంటారు. అదీ తప్పే. అనుకున్నట్లు కాకపోతే తట్టుకోలేనండి! అంటాడు ఒకడు. కాని తప్పదు. తట్టుకోవాలి!

ఇంతకూ నిజమేమంటే, పనిని చేయడంలో మనకు ప్రసక్తి ఉంది గాని, ఆ పనివలన కలిగే ఫలితం విషయంలో మనకు ప్రసక్తి లేదు, ఉండటం మంచిది కూడా కాదు. అలా ఉండటం వల్ల నష్టమే జరుగుతుంది తప్ప లాభం ఒనగూడదు.

ఒక విద్యార్థి పరీక్షలో ప్రశ్నలకు జవాబులు వ్రాస్తున్నాడు. ఒక్కొక్క ప్రశ్నకూ జవాబును పూర్తిచేసిన తరువాత ఇంతకూ దీనికి ఎన్ని మార్కులు పడతాయి అని ఆలోచిస్తున్నాడు. ఎన్ని మార్కులు వస్తే తనకు క్లాసు వచ్చే అవకాశముంది అని బుర్ర గోక్కుంటున్నాడు. ఈ ఆలోచనలకు పది నిమిషాలు పట్టింది. అప్పుడు స్పృహలోనికి వచ్చి రెండవ ప్రశ్న మొదలుపెట్టాడు. ఈసారి వ్రాస్తూ ఉండగానే ‘ఈ ప్రశ్నకు సుమారు ఎన్ని మార్కులు పడతాయంటారు’ మనం అనుకున్న మార్కులు పడతాయా? ఈ పేజీలన్నీ మొత్తం అక్కడిదాకా పోతాయా? వ్రాతకి వేగం తగ్గింది. ప్రశ్నలు మాత్రం వ్రాయాల్సినవి చాలా ఉన్నాయి. ఇంకా అరగంట మాత్రమే ఉంది–అని హెచ్చరిస్తున్నాడు పర్యవేక్షకుడు. కంగారుపడుచున్నాడు క్లాసు కావాలనుకుంటున్న మన విద్యార్థి. పని జరుగుతూ ఉండగానే, ఫలితాన్ని గూర్చి ఆలోచించినందువల్ల అతనికి కలిగినది లాభమా? నష్టమా చెప్పండి! కనుక ఫలితాలపై దృష్టితో పనిచేస్తున్నవాడు ఇటు పనికీ న్యాయం చేయలేడు, అటు ఫలితాన్ని పెద్దగా పొందలేడు. ఏమంటారు!

అర్ధరాత్రివేళ ఊహించలేనంత వేగంగా వెళుతోంది లారీ. లారీ నిండా లోడు. లోడు పైన పడుకున్న మనుషులు, నరసంచారం లేని రోడ్డది. ఎక్కడా ఆపవలసిన అవసరం కనబడటం లేదు. హారన్లకు కూడా పని తగలడం లేదు. ఇటూ, అటూ పరుగెత్తే వాహనాలు మాత్రం పరుగెత్తుకొని పోతున్నాయి. ఆ సమయం వాహనాలకే కేటాయించబడిందా అన్నట్లుగా ఉంది ఆ పరిస్థితి. ఉన్నట్టుండి డ్రైవరుకు ఒక ఆలోచన వచ్చింది. ‘ఈరోజు భలే స్పీడుమీద వెళుతున్నాం, బహుశా ఎవడూ ఇంత స్పీడుగా వెళ్లలేదేమో! ఈ కాస్త సమయంలో ఎన్ని కిలోమీటర్లు వచ్చి ఉంటాను? అంటూ లెక్కలు కడుతున్నాడు. మరుక్షణంలో రక్తపాతాల మధ్య వాహనాల భాగాలు, మానవుల అవయవాలు. అటూ, ఇటూ బారులు తీరిన వాహనాలు. ఏమిటీ దుస్థితి. ఫలితాన్ని గూర్చి ఆలోచించేటప్పటికి సాక్షాత్కరించిన ప్రమాదపరిస్థితి ఇది. కనుక పనిచేస్తున్నవాడికి “ఇంతవరకూ మనం ఎంత సాధించాం! ఫలితాన్ని ఎంతవరకు సాధించి ఉంటాం. మొదలయిన ఆలోచనలు రావడం మంచిది కాదు, చూశారుగా ఆ ఆలోచనలు కూడా ఎంతటి దుస్థితిని సృష్టించాయో! పనిని

చేసుకుంటూ పోవడమే మానవుని కర్తవ్యం. ముందు వెనుకలు అతనికి అనవసరం!"



అది ఒక కుగ్రామం. ఆ గ్రామంలో ఒక కడజాతి కుటుంబం. అందులో వృద్ధ దంపతులు. వారికొక్కడే కొడుకు. వాణ్ణి నానాశ్రమపడి తాము కడుపు కట్టుకొని వాడికిన్ని మెతుకులు పెడుతూ ఇలా అలా వాడిని చదివించి పెద్ద చేసారు. వాణ్ణి పెద్ద చేయడంలో వారి శరీరాలు చెమటగా మారి జారిపోయాయి. బొమికెల గూడుగా మారాయి. కుర్రవాడు దూరాన ఎక్కడో మనది కాని దేశంలో పెద్దపని చేస్తున్నాడు. ఇంటి దగ్గర దంపతులు కదలలేని స్థితిలో ఉన్నారు. ఒకళ్లవైపు ఒకరు చూసుకుంటున్నారు. మొదటినుండీ వాళ్లకు ఒక కోరిక ఉండేది. పెద్ద అయ్యేంతవరకే ఒక కష్టం. ఆ తరువాత అంతా వాడే చూసుకొంటాడు. ఇంత పెద్దయిన తరువాత ఆ మాత్రం తల్లిదండ్రులను చూచుకోలేకపోతాడా అని వాళ్ళ విశ్వాసం. అబ్బాయితోపాటు మనం కూడా అటూ, ఇటూ కూర్చొని క్రొత్త క్రొత్త కార్లలో అలా తిరుగుతూ ఉంటే ఎంత బాగుంటుంది! అంటూ కలలు కన్నారు వాళ్ళు.

కొడుకు దగ్గరినుండి ఎప్పుడయినా కొంత మనియార్డర్ మాత్రం వస్తుంది. కాని వీరి మర్యాద మాత్రం తీరడం లేదు. బాబూ! డబ్బులు మాకెందుకురా! నీవు కావాలి! నీతో కలసి నీ తల్లిదండ్రులుగా ఆనందంగా గడపాలని ఉంది. వచ్చి మమ్మల్ని తీసుకెళ్లరాదా? ఇంకా ఎంతకాలముంటాం? కాస్త కాలు చేయి ఆడుతూ ఉండగానే మమ్మల్ని తీసికొని నాలుగూ చూపరాదా! మమ్మల్ని అక్కడికి తీసికొనిపో! అంతా ఒకేచోట ఉందాం. ఉత్తరం వ్రాయించారా తల్లిదండ్రులు. ఎంతో ప్రేమగా ఇక కొడుకు వచ్చేస్తాడనుకుంటున్నారు. సర్దాల్సినవేమున్నాయి అని చూస్తున్నారు. కారులో కొడుకు రాలేదుకాని, కార్డుముక్క మాత్రం వచ్చింది. ఇక్కడ నేనుండేది మహానగరం. అక్కడ మీరుండేది కుగ్రామం. నేను అక్కడికి రావడానికి తీరికలేదు. మీరు ఇక్కడికి రావడానికి ప్రయత్నించకండి. ఇక్కడ మీరు ఇమడలేరు. మీ వేషభాషలను చూచి ఇక్కడివారు అసహ్యించుకుంటారు. మీరు మీ అలవాట్లను మానుకోరు. దానితో ఇక్కడివారు మిమ్మల్ని త్రోసేస్తారు. అన్నింటినీ మించి, మీరు నాతో ఉంటే ఇంటికి వచ్చే ప్రతివారికీ మిమ్మల్ని నా తల్లిదండ్రులుగా చూపించవలసి ఉంటుంది. నేను అలా చూపించలేను. అది నాకు ఇష్టం లేదు. ఇప్పటి నాస్థాయికి అది చాలా భంగకరం. వీరేనా ఈయన తల్లిదండ్రులు అని వారు అసహ్యించుకొంటారు. మళ్లీ ఇంటికి రారు కూడాను! నేనూ, కోడలు, పిల్లలు మంచిగా బ్రతకాలని ఉంటే ఇక్కడికి రాకండి: మీ కోడలు మిమ్మల్ని చూసి ఇష్టపడుతుందని కూడా నేను అనుకోను. మీ జీవితాలు, ఇష్టాలు, అలవాట్లు అలాంటివి. మీ మొరటుదనం అలాంటిది. నేను చేయగలిగింది లేదు. అప్పుడప్పుడు డబ్బు మాత్రం పంపిస్తుంటాను. దానితో తృప్తిపడండి. ఇదీ ఆ ఉత్తరంలోని సారాంశం. గుంటలుపడిన వాళ్ళ కళ్ళు కన్నీళ్ళతో నిండాయి. కన్నీటి గుంటలయ్యాయి. వాళ్ళ కల అలా చెదిరిపోయింది. కొడుకేనా ఇలా వ్రాసింది, కన్నకొడుకేనా? అంటూ గుండెలు బాదుకున్నారు వాళ్ళు. అంతే ఆ బాధతో మంచం పట్టారు. ఇక్కడ జరిగింది ఏమిటి?

ఆ దంపతులు ఒక ఫలితాన్ని ఆశించారు. (ఆశిస్తే అసంతృప్తి, ఆశించకుంటే మిగిలేది అసలు తృప్తి) దాన్ని గూర్చి తమ జీవితాన్ని ధారపోశారు. కొడుకును పెద్దవాణ్ణి చేసి, ప్రయోజకుడిని చేశారు. కాని వారికి ఫలితం దక్కలేదు. వారు కృంగి మంచాన పడ్డారు. ఇంత చేసిన దానికి ఇదా ఫలితం అని వారికి అనిపించింది. మనకు అనిపిస్తుంది. కాని విశేషమేమంటే ఎలాంటి ఫలితం ఆశించకుండా వీడు మన కడుపున పుట్టాడు. వీడిని పెంచి, పెద్దచేసి, ప్రయోజకుడిని చేయడం మనధర్మం అనుకొని ముందుకు సాగాడనుకోండి, అప్పుడు కూడా కొడుకు పెద్దవాడై, ప్రయోజకుడై ఇందాకటిలాగానే తల్లిదండ్రులను మరచిపోయాడనుకోండి – ఈ తల్లిదండ్రులకు బాధ కలగదు. మనధర్మం మనం నిర్వర్తించాము. నిర్వర్తించినందుకు వాడు పైకి వచ్చాడు. భార్యాపిల్లలతో హాయిగా జీవిస్తున్నాడు. అంతకంటే మనకు ఇంకేం కావాలి అనిపిస్తుంది.



మొదటి తల్లిదండ్రులు ఫలితాన్ని ఆశించి దుఃఖాన్ని మిగుల్చుకున్నారు. రెండవ తల్లిదండ్రులు ఫలితమన్నదానితో ప్రసక్తిలేకుండా, ధర్మంగా ఆచరించి తృప్తిని పొందారు. గమనించండి. ఫలాపేక్ష ఇక్కడ ఎలాంటి దుఃఖాన్ని కలిగిస్తున్నదో!

గాంధీమహాత్ముడు దేశ స్వాతంత్ర్యం కోసం తపించాడు. పరితపించాడు. పస్తులున్నాడు. దెబ్బలు తిన్నాడు. చాలీచాలని బట్టతో జీవితమంతా గడిపాడు. ఎప్పుడూ కదులుతూనే కనిపించాడు. వందల వేలమంది యువకులను నాయకులుగా తీర్చిదిద్దాడు. కోట్లమంది ప్రజలను చైతన్యవంతులుగా చేసాడు. జాతిని పవిత్రీకరించడానికి ప్రయత్నించాడు. జాతికి క్రమశిక్షణ నేర్పాలని తాపత్రయపడ్డాడు. ఎట్టకేలకు స్వాతంత్ర్యాన్ని సాధించాడు. జీవితాంతం అహింసను బోధించిన ఆయన జీవితం హింసతో అంతమైంది. రక్తపుమడుగులో ఆయన ఒదిగిపోయాడు. మనకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చిపోయాడు. ఎటువంటి తపస్సుతో ఈ ఫలితాన్ని సాధించాడాయన. తలచుకుంటే కళ్లు చెమరుస్తాయి. కాని ఇప్పుడున్న పరిస్థితులేమిటి? ఆలోచించండి. ఇప్పటి దేశాన్ని గురించి ఆలోచిస్తే, గాంధీమహాత్ముని తపస్సుకు ఫలితమిదేనా అనిపించదూ? ఇంతకాడికి ఆయన అంత తపస్సు చేయడమెందుకు? అనిపించదూ, కాని ఆయన చేసాడు. భగవద్గీతను చేతపట్టుకొని మరీ చేసాడు. అనుక్షణం గీతను అధ్యయనం చేస్తూ మరీచేసాడు. చేయవలసిన తపస్సును చేస్తున్నాను. ఇక జాతి ఈ తపఃఫలితాన్ని ఎలా వినియోగించుకొంటుందీ అన్నది ఇటు జాతికి, అటు దైవానికి వదిలిపెడుతున్నాను, అన్న దృఢనిర్ణయంతో చేశాడు. అలా వదిలిపెట్టేశాడు. జాతి క్రిందా మీదా పడుతున్నది. దైవం పైనుండి క్రిందకు చూస్తున్నాడు. దీనికేం చెబుతాము మరి? జరిగిన తప్పేమిటి? నడుస్తున్న ఫలితమేమిటి? అంత మంచిపనికి ఇంతటి దుష్ఫలితమా? అని అనిపిస్తుంది.

ఒక్కటి గమనించాలి. ఫలితం ఎప్పుడూ ఒక వ్యక్తినిబట్టిగాని, ఒకజాతిని బట్టిగాని నిర్ణయం కాదు.

దాని ఆనుపానులు ఒకప్పుడు మనకు  అందవచ్చు, అనేక పర్యాయాలు మనకు అందకపోవచ్చు. ఇది చాలా నిగూఢమయిన విషయం. ఏది ఎందుకు జరుగుతున్నది అన్నది ఒకపట్టాన తెలిసేది కాదు, అందరికీ బోధపడేది కాదు.

మనం చేస్తున్న పనిని మన పని అనుకుంటున్నాము. దాని నుండి మనకు కావలసిన ఫలితం రావాలని కోరుకుంటున్నాము. నిజానికి మనం సృష్టిలో ఒక భాగం. సృష్టికి చెందినవాళ్ళం. మనమీదుగా నడుస్తున్నది సృష్టికార్యం. ఫలితం సృష్టికి సంబంధించినదే, సృష్టి అనే పెద్దకథలో బుల్లి ఉపకథ మనది. కనుక మనమనుకున్నట్లుగా పెద్ద కథ నడవదు. అసలింతకూ పెద్దకథ ఏమిటో, బోధపరచుకొనగలిగినవారు తక్కువ. మనమీదుగా సాగుతున్న కర్మలూ, ఫలితాలు ఆ పెద్ద కథకు అనుగుణంగా సాగిపోతుంటాయి. సాగిపోవాలి కూడా! అలా పెద్దకథ ప్రకారం మన ఈ బుల్లి ఉపకథ సాగుతున్నపుడు కొన్ని మనం అనుకున్నట్లుగా జరుగుతాయి. కొన్ని మనం అనుకున్నట్లు జరగవు. అనుకున్నట్లు జరిగాయి అంటే పెద్దకథకు తగినట్లుగా అనుకోవడం మనకు అప్పుడు చేతనయిందన్నమాట. అనుకున్నట్లుగా జరగలేదు అంటే, పెద్దకథకు తగినట్లుగా అనుకోవడం మనకు చేతకాలేదన్నమాట! ఇది గ్రహించాలి.

సృష్టికథను బట్టి కర్మాచరణ జరుగుతున్నప్పుడు ఒకసారి వెంటనే ఫలితం కనిపిస్తుంది. ఒకసారి కొద్దిగా కనిపిస్తుంది. ఒకసారి అనుకున్నంత కనిపించదు. ఒకసారి ఊహించనంత కనిపిస్తుంది. ఒకసారి అసలు కనిపించదు. ఒకసారి విరుద్ధంగా, ఒకసారి వక్రిస్తుంది. ఒకసారి ఇంకెప్పుడో అనుభవానికి వస్తుంది. కనుక కర్మఫలితాన్ని మనం సృష్టికథకు వదిలివేయాలితప్ప, దానిపై మనమెలాంటి అధికారాన్ని కూడా ఆపేక్షించకూడదు. మన ప్రకారమే జరగాలి అని పట్టుపట్టకూడదు. ఎందుకు జరగలేదని మధనపడకూడదు. జరగకపోతే ఇంకెందుకు అని విషాదదృశ్యాలను సృష్టించకూడదు. కర్తవ్య కర్మను నిర్వహించుకుంటూ వెళ్ళిపోవాలి. ఫలితం ఉంటుంది. లేకపోవడమనేది ఉండదు. అది ఎప్పుడు ఎలా అనుభవానికి రావాలి అనేది మాత్రం సృష్టికథ ప్రకారం నిర్ణయమవుతుంది. కనుక మనం ఫలితాన్ని అటువదిలి పనిని చేసుకొంటూ పోవడమే పద్ధతి!

ఫలితాన్ని గూర్చి ఆలోచిస్తున్నవాడు పనికి న్యాయం చేయలేకపోతున్నాడు. దీనిని మనం విద్యార్థి ఉదాహరణలో చూసాం. ఫలితాన్ని గూర్చి ఆలోచిస్తూ పని చేస్తున్నవాడు పనియెడల ఏమరుపాటు చెంది, ఆ ఏమరుపాటు వల్ల ప్రాణాంతక స్థితినే సృష్టించుకోగలుగుతున్నాడు. దీనిని మనం లారీడ్రైవరు సన్నివేశంలో చూసాం. ఫలితాన్ని గూర్చి ఆలోచించుకుంటూ, ఫలితాన్ని ఆకాంక్షిస్తూ, మంచి పనిని చేసి, ఆ మంచిపనికి జీవితమంతా ధారపోసి, ఫలితాన్ని ఆశించడంవల్ల చివరకు మంచమెక్కిన వారిని, తల్లిదండ్రులు కొడుకు కథలో చూసాం. ఫలితాన్ని ఆశించినందువల్ల వారు మంచి పనిచేసి చివరకు మంచమెక్కారు. ఫలితాన్ని



ఆపేక్షించకుండా కొడుకును తీర్చిదిద్దిన తల్లిదండ్రులు ఎలా తృప్తిగా చరమజీవితాన్ని గడిపారో ప్రక్కనే చెప్పుకున్నాం. ఫలితాన్ని ఉద్దేశిస్తూ పని చేయడం వల్ల మనిషి ఎలాంటి ఇబ్బందులకు గురి అవుతున్నాడో చూడండి. ఈ ఇబ్బందులకు మానవులు గురికాకుండా ఉండాలని ప్రేమమయుడయిన భగవానుడు **'మీరు పనిని చక్కగా చేయండి. ఫలితం సంగతి నాకు వదిలేయండి. నేను చూసుకొంటాను'** అన్నాడు. నేను చూసుకుంటాను అన్నాడు తప్ప, నేను తీసుకుంటాను అనలేదు ఆయన. ఈ సూక్ష్మాన్ని గమనించండి! నేను చూసుకుంటాను అంటే "మీరు చేస్తున్న కర్మకు ఎప్పుడెప్పుడు ఏ కర్మకు ఎలాంటి రూపంలో ఎంతెంతగా ఫలితాన్ని అందించవలసిందీ నా సారధ్యంలో మీకు అందించబడుతూ ఉంటుంది" అని అర్థం. ఆ ఫలితాలను ఎప్పుడు, ఎలా అందించవలసిందీ నాకు తెలుసును అని అర్థం. కనుక కంగారుపడవలసిన పనిలేదు అన్నది ఆయన ఆజ్ఞ.

ఇక గాంధీమహాత్ముని కథ దగ్గరకు వచ్చేటప్పటికి మనకు తెలసినదేమిటి? కర్మకు ఫలితమనేది సృష్టికథతో ముడిపడి వుంటుంది, దానిని గెలుపు అనుకోలేము. ఓటమి అనుకోలేము. కేవలం ఒక కోణం నుండి గమనిస్తే అందే అంశం కాదిది. కర్మ ఫలితం, అనేది వ్యక్తిగతం కాదు, సృష్టిగతం. కనుక మనమీదుగా జరిగిన కర్మయొక్క ఫలితం సృష్టికథకు అనుగుణంగానే సాగిపోతుంది తప్ప, మనమనుకున్నట్లుగా సాగాలని లేదు, అలా సాగాలని మనం అనుకోకూడదు కూడా! అని మనం గమనించాం.

ఫలితంపై ప్రత్యేకమైన దృష్టిలేనివాడు, తాను చేస్తున్న పనికి పరిపూర్ణమైన న్యాయాన్ని చేకూర్చ గలుగుతాడు. శ్రద్ధగా, తృప్తిగా, సమర్ధవంతంగా పనిచేయగలుగుతాడు. అతని దృష్టి మొత్తం పనిమీదనే లగ్నమై ఉంటుంది. అప్పుడు పని రాణిస్తుంది. అతడు ఆ పనిలో మరింత సమర్ధుడవుతాడు.

మనం సృష్టిలోని భాగం. సృష్టికార్యం మనమీదుగా సాగిపోతున్నది. మనం చేస్తున్నది మన పనికాదు. సృష్టికి సంబంధించిన పని. **కర్మ మనవలన జరగడం లేదు, మనద్వారా జరుగుతున్నది. మనమీదుగా జరుగుతున్నది.** కాబట్టి ఫలితాలు కూడా సృష్టికి సంబంధించినవే అవుతున్నాయి. అవి సృష్టికే సమర్పితం కావలసి ఉంది. అటువంటప్పుడు మనకొరకు వాటిని వినియోగించు కోవాలనుకోవడానికే ఈ కర్మలను మనం చేస్తున్నామనుకోవడం సరికాదు. ఏ ఫలితమయినా కృష్ణార్పితం కావలసినదే. మరి మన సంగతి ఏమిటి? కంగారు పడవలసిన పనిలేదు. ఈ సృష్టిలో మనకొరకని మనం జాగ్రత్త పడడం అనవసరమన్నమాట. అంటే, జాగ్రత్తపడుతున్నాము అంటే సృష్టిని గురించి మనకు తెలిసింది అంతేనన్నమాట. ఎంత తేలికగా ఉన్నది మనచూపు. మన కర్తవ్యాన్ని మనం నిర్వహిస్తూ ఉంటే, మనకు కావలసినవన్నీ అవే అమరుతూ ఉంటాయి. వాటికై మనం ప్రత్యేకంగా తడుముకోవలసిన పనిలేదు. పరీక్షలకు శ్రద్ధగా చదువుకుంటున్న పిల్లవానికి తల్లిసరిగా సమయానికి హార్లిక్స్‌ను అందిస్తున్నది కదా! దానికి అతడు లేచివెళ్లి అడగవలెనా!

అదే చదవని పిల్లవాడు పదిసార్లు



అడిగినప్పటికీ తల్లి, చేతిలో పని వున్నది ఇస్తాను ఆగు' అంటున్నది కదా! కర్మభ్రష్టుల సంగతి ఇలా ఉంటుంది అని మనకు తెలియాలి. కనుక స్వధర్మాచరణలో నిరంతరం సాగిపోతున్నవాడికి అవాంతరం ఉండదు. తీరని అవసరముండదు. లభించని సుఖభోగాలుండవు. అన్నీ వచ్చి అతణ్ణి వరిస్తాయి. కర్మాచరణంలోని వైభవమిది అని వివరిస్తాయి. ఇది అనుభవం నుండి చెబుతున్నమాట!

కనుక ఫలితాలను గూర్చి గాని, జీవితాన్ని గూర్చి గాని, భవిష్యత్తును గూర్చి గాని చింత అక్కరలేదు. ఫలితముపై మనకు అధికారము లేదు కదా! అని పని చేయుట మాననక్కరలేదు. అలా మానడం వలన మనం సోమరులమవుతాం! భ్రష్ఠత చెందుతాం! వ్యర్ధజీవుల మవుతాం! కొరగాని వారమవుతాం! కనుక మానవుడు ఏ వంకనాకూడా పనిచేయడం మాత్రం మానకూడదు. ఏ వంక పెట్టినా అతడు భ్రష్ఠుడే అవుతున్నాడు. అలాకాక కర్మనిష్టుడయి సాగినవాడు అన్నివిధాలా పరిపూర్ణమైన జీవితాన్ని అనుభవించ గలుగుతాడు. ఇహపరాల రెండింటినీ సమన్వయించుకొని ముందుకు సాగగలుగుతాడు. అతడు దేనినీ వదలడు. అతడు దేనికీ అంటుకోడు.

**– పార్థసారథి ప్రవచనాలు**

# చేస్తే అలా చెయ్యి

**"సంస్థల కన్నా వ్యక్తి శ్రేయస్సుకే బాబూజీ దృష్టిలో ప్రాముఖ్యత"**

ఒకచేతిలో రసీదు పుస్తకాల కట్ట, మరొక చేతిలో లెటర్ హెడ్‌ప్యాడ్స్ కట్ట పట్టుకొని ఒక నలభైఏళ్ల నడివయస్కుడు మాస్టరుగారి గదిలోనికి ప్రవేశించాడు. అలా ఆ కట్టలు పట్టుకునే చేతులు జోడించే ప్రయత్నం చేస్తూ, "నమస్కారం మాస్టారుగారూ"! అని కట్టలు క్రిందపెట్టి నిలబడ్డ అతనిని చూపులతోనే కూర్చోవలసిందిగా సూచించారు మాస్టరుగారు.

కొద్దిక్షణాల తరువాత తానప్పటికి చేస్తున్న పనిని కొంచెం ప్రక్కగా పెట్టి "ఏమిటోయ్ ఇలా వచ్చావ్? ఈ పుస్తకాల కట్టలూ అవీ ఏమిటోయ్"? అని అడిగారు. తిరిగి చేతులు జోడిస్తూ తాను కూర్చున్న ఆసనాన్ని మాస్టరుగారికి దగ్గరగా జరుపుకొని, వినమ్రంగా కూర్చుంటూ, "మాస్టరుగారూ మీకు చెప్పకుండా ఒక చిన్న మంచిపని చేసానండీ? అందుకు మీ ఆశీస్సులు కావాలి" అంటూనే పాదాల చెంతకు వంగాడు. చేతులతో మాస్టరుగారి పాదాలను స్పృశించి కన్నులకు అద్దుకుంటున్నాడు. ఆ పుస్తకాల కట్టలను కూడా ఆ పాదాలకు తాకించే ప్రయత్నం చేస్తున్నాడు.

కట్టలతో సహా అతణ్ణి అలా ఆపి, అలా చేయడం కట్టి పెట్టమని కన్నులతోనే వారిస్తూ, "ఇంతకీ ఈ హడావుడేమిటో చెప్పు మహానుభావా! నువ్వు కంగారుపడిపోతున్నావు, నన్ను కంగారు పెట్టాలని చూస్తున్నావ్,



కూర్చో, అలా ప్రశాంతంగా కూర్చొని సంగతేమిటో చెప్పు. "ఏం లేదు మాస్టారుగారూ మీ అనుమతి తీసుకోకుండా ఒక చిన్న పని చేసాను. నా మీద ప్రేమతో మీరా పనిని అనుమతించి, ఆశీర్వదించాలి" అంటూ అతను రశీదుల పుస్తకం ఒకటి, లెటర్ హెడ్ ప్యాడ్ ఒకటి మాస్టరుగారి చేతిలో పెట్టాడు. పెట్టి ఉత్కంఠతతో మాస్టరుగారివైపు అలా చూస్తూ ఉండిపోయాడు.

మాస్టరుగారు ఆ రెండు పుస్తకాలను తెరచి చూసారు. తెరిచి అలా చూస్తూ చూస్తూ ఉండగానే ఆయన చూపుల తీవ్రత పెరగసాగింది. అంతకంతకూ వదనం గంభీరతను దాలుస్తున్నది. ఉత్కంఠతతో చూస్తున్న అతనికి ఊపిరి అందడం కష్టంగా ఉంది. ఫ్యాను పైన తిరుగుతున్నా స్వేదం బిందువులు బిందువులుగా అలా పొందుకొని వస్తూనే ఉన్నది.

వదనాన్ని పైకెత్తి సూటిగా అతని కన్నులలోనికి చూస్తూ, "ఏమిటీ పని? ఊఁ ఏమిటీ పని? చెప్పు, ఎవరిని అడిగి చేసావ్? మీతో చెప్పకుండా ఒక చిన్న మంచి పని చేసాను అని నీవు చెప్పినపుడే అనుకున్నాను ఇలాంటిదేదో చేసి ఉంటావని. ఏమిటీ పని?

"మంచి పనని నీవనుకుంటే సరిపోతుందా? నీకు మంచి పని అనిపించింది. నాకు అనిపించకపోవచ్చు గదా ఏమంటావ్? ఎందుకిలా చేసావ్? ఇలా చేయాలని నీకెందుకు అనిపించింది. చెప్పవేం? చేసిన వాడివి చెప్పవేమయ్యా? ఎందుకు చేశావిది?"

చెమటలు పడుతున్న అతనికి ప్రయత్నించినా గొంతు పెగులుతున్నట్లుగా లేదు. మరింత ప్రయత్నం మీద గొంతును పెగల్చుకుంటూ "క్షమించండి మాస్టారూ! మీ అనుమతిని తీసుకోకుండా ఇలా చేయడం తప్పే. ఇందులో వేరే ఉద్దేశ్యం ఏదీ లేదండి. మీమీద ఉన్న ఆరాధనా భావంతో ఈ పెట్టబోయే వ్యాపార సంస్థకు కూడా మీ పేరే పెట్టుకోవాలని ఉద్దేశపడ్డాను".

"కాని నేను చేసింది తప్పే. ముందుగా మీతో చెప్పి, మీ అనుమతిని తీసుకొని చేయవలసింది. తప్పు జరిగిపోయింది. దీనికి కారణం ఒక్కటే, నేను చేసిన ఈ పని మిమ్మల్ని ఇంతగా నొప్పిస్తుందని నేను ఊహించలేదు". కొద్ది నిమిషాల పాటు నిశ్శబ్దం అక్కడ ఆవరించింది. బొమ్మలోని ఒక దృశ్యంలా ఆ గది అలా నిలబడిపోయింది. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ, మాస్టరుగారిలా అన్నారు"మరిప్పుడేమిటి చేస్తావ్? ఊఁ ఏం చేస్తావయ్యా"? "మీరేం చేయమంటే అది చేస్తానండీ! జరిగిన దానికి బాధపడుతున్నానండీ! అన్నాడతను దీనవదనుడై. పుస్తకాలు రెండింటినీ అతని చేతికందిస్తూ "ఒక పనిచేయి. ఈ పుస్తకాలని ఇంటికి తీసుకువెళ్లి ఒకచోట పెట్టు. పెట్టి వాటిపైన ఒక అగ్గి పుల్లగీసి పడెయ్, ఏం అర్థమయిందా". అతను తలవంచుకుని ఉన్నాడు. అతని చూపులు మాత్రం మాస్టరుగారి పాదాల చుట్టూ తిరుగుతున్నాయి.



మళ్లీ కొంత సేపు నిశ్శబ్దం. భరించడానికి కష్టంగా ఉన్న నిశ్శబ్దమది. ఆ నిశ్శబ్దాన్ని అంతం చేస్తూ, మాస్టరుగారు ఇలా అన్నారు. ‘‘నేను నీ భక్తిని అర్థం చేసుకోగలను. కాని నీ చర్యను సమర్ధించలేను.” అతడు ఆవేదనతో కూడిన ఆశ్చర్యంతో తలను పైకెత్తి మాస్టరుగారిని చూస్తున్నాడు. మాస్టరుగారు ఇంకా ఇలా అన్నారు. “నీ ఈ చర్యను సమర్ధించడం సాధ్యం కాదు. ఇన్నినాళ్ల మన సహచర్యంలో ఎవరైనా తమ వ్యాపారాలకుగాని, సంస్థలకు గాని, మన పేర్లు పెట్టినట్లు చూసావా?” “లేదు” అన్నాడతను. మరి నువ్వెందుకు అలా చేసావ్? వాళ్లే చేసి ఉంటే బాగుండేది. వాళ్లు చేయలేదు కాబట్టి మనమైనా చేద్దామని నీకనిపించింది కదూ! పిచ్చివాడా! కాస్తంత సందిచ్చి ఉంటే ఇప్పుడు నీవు చేసిన పని కొన్ని పదుల మంది చేసేవారు.

చూడూ! ఇలా వ్యాపార సంస్థలకూ, వాటికి తమ పేర్లను వాడుకోవడానికి ఇష్టపడటమనేది ఉన్నదే, దీనికి పరమ గురువులు ఏ మాత్రం అంగీకరించరు. వాళ్లకు ఇష్టం లేని పని ఇది. ఈ విధమైన ప్రచారానికి వాళ్లు సుముఖత చూపరు. పోనీ నీవే పెట్టావు అనుకో, పేరయితే పెట్టగలవుగాని, ఆ పేరుకు తగ్గట్టుగా నీవా వ్యాపారాన్ని నడపగలుగుతావా? వ్యాపారమన్న తరువాత ఎన్ని లావాదేవీలుంటాయి? మరి ఇవన్నీ ఈ పేరుమీదుగా నిర్వహించడం భావ్యమంటావా? ఒక్క క్షణం ఆలోచించు. మాస్టరుగారి పేరుపెట్టుకోవాలని ఉబలాటపడ్డావు. అంతవరకూ బాగానే ఉంది. మరి ఆ పేరుకు మనం న్యాయం చేయగలమా? లేదా? అని ఆలోచించావా?

“అయితే లోకంలో చాలామంది తమకు నచ్చిన పెద్దల పేర్లను, దేవుళ్ల పేర్లను తమతమ వ్యాపారాలకు, ప్రాజెక్టులకు పెట్టుకుంటున్నారు కదా! అని నీవనవచ్చు. అది వేరు విషయం. ఎందుకని అలా అంటున్నానంటే వాళ్లు ఆ పేర్లను తమకు కలిసి రావాలనే ఉద్దేశంతో పెట్టుకుంటున్నారు తప్ప ఆ పేర్లకు తగ్గట్టుగా నడుచుకోవాలని వారనుకోవడం లేదు. ***దేవుడి ప్రకారం తాను పనులు చేయడమన్నది మరిచిపోయి, తాను చేయదలచిన పనులకు దేవుణ్ణి తీవ్రస్థాయిలో వాడుకునే ప్రయత్నం చేస్తున్నాడు ప్రస్తుత భారతీయుడు.*** అది మంచి పద్ధతంటావా? నువ్వా దాన్ని అనుసరిస్తానంటావా? మనం చేసే పనులు లోకానికి మంచిదారిని చూపించేవిగా ఉండాలి, అంతేగాని, లోకాన్ని మనం గుడ్డిగా అనుకరిస్తూ వెళ్లిపోతే ఎలా”? మళ్లీ కొంతసేపు నిశ్శబ్దం. ఈసారి నిశ్శబ్దం ఆలోచనాత్మకంగా ఉంది.

మాస్టరుగారి పెదవులు చిన్న చిరునవ్వు నవ్వుతూ విచ్చుకున్నాయి. విచ్చుకుంటున్న పెదవులతో కొంటెగా, అతని గుండెలకు గుచ్చుకునేటట్లు చూస్తూ, ఇలా అన్నారు. “ఏమోయ్! నీ ప్రయత్నమదీ చూస్తుంటే నన్ను కూడా ఒక దేవుణ్ణి చేసేదాకా వదిలేలాగా లేవే? ఊ అంతేనా! చూడూ! ఆ వెర్రిన పడకు. నన్ను నన్నుగా ఉండనీ. ***నా గురించి లోకానికి చెప్పేముందు, నేనంటే ఏమిటో తెలుసుకో, అది చాలు నాకు.***



***నిజానికి ఏ పెద్దవాళ్లయినా సన్నిహితుల నుండి అభిలషించేది అదే. అది మాని, ఆ అర్థం చేసుకోవడం మాని లోకంవైపుకు తిరిగి బాకా కొట్టుకోవడం కలిప్రేరితమైన ఆధునిక లక్షణాలలో ఒకటి.***

నేను నీకు నచ్చాను. బాగుంది మంచిదే, అయితే అప్పుడు నీవేం చేయాలి. నా జీవన విధానం నీకు నచ్చింది కనుక నేను ఏ సూత్రాలకు కట్టుబడి జీవిస్తున్నానో నా సాహచర్యంలో ఎప్పటికప్పుడు గమనించుకుంటూ అలా నీవు కూడా నీ జీవితాన్ని నడుపుకునే ప్రయత్నం చేయాలి. **("నావారు అనుకున్నవారు, నా పద్ధతులు నచ్చినవారు నా మార్గాన్నే అనుసరిస్తారు. నా పద్ధతుల్నే పాటిస్తారు. కాదనుకుంటే, వాళ్లు నా మార్గం నుంచి తప్పుకున్న వాళ్లవుతారు" – బాబూజీ.)** అంతేగాని, మిగిలిన ఈ హడావిడంతా ఎందుకు? హడావిడి వల్ల ఏమిటి చేద్దామని నీ ఉద్దేశం? వేలాదిగా జనాన్ని ఆకర్షించి నా పాదాలమీద పడేద్దామనా? ఒకవేళ అలా పడేశావనే అనుకుందాం. వక్రమార్గాల ద్వారా ఆకర్షింపబడిన జనం ఎంతకాలం నిలుస్తారు? చెప్పు.

చేతనైతే నీవు కూడా నాలాగా జీవించు. నీ జీవితాన్ని ఇలా సద్వినియోగం చేసే ప్రయత్నం చేయి. అప్పుడు నా జీవితం నీకూ, నీలాంటి మరి కొందరికి ప్రేరణ నిచ్చినట్లే. నీ జీవితం కూడా మరింత మందికి ప్రేరణ నీయగలుగుతుంది. **నీ గొంతులోకాదు, ఈ పేర్లతోకాదు, నిజంగా నేనంటే నీకు ఆరాధనా భావం ఉంటే, నేనంటే ఏమిటో నీ జీవిత విధానం ద్వారా ఈ లోకానికి తెలియచెప్పు. ఈ బోర్డుపైన కాదు, నీ లోపల ఆ గుండె లోపల వ్రాసుకో.** ఆంజనేయుడు చేసిందదే. చేతనైతే అతణ్ణి అనుసరించి అతడు తన జీవన విధానం ద్వారా  రోజుకు కూడా రాముని చెంతకు జనాల బాధలను నడిపిస్తూనే వున్నాడు.

కేకలేశానని బాధపడ్డావా? అవి బాధపడివేసిన కేకలు. సత్యం నీకు బోధపడాలని వేసిన కేకలు. అభిమానమనే వెర్రి నుండి, **"ఆరాధన" (తృప్తి పరచడం, ప్రీతి కలిగించడం – ప్రేమను, కృతజ్ఞతను వ్యక్తీకరించడం)** అనే అమృతత్వానికి నిన్ను మళ్లించడానికి వేసిన కేకలు. కేకలు వేసానని బాధపడుతున్నావా? అతని కన్నుల వెంట భాష్పాలు రాలుతున్నాయి. మామూలు భాష్పాలు కావవి. అనుభూతి భాష్పాలు. ఆ భాష్పాలలో నుండి అతడు మాస్టరుగారి వైపు చూస్తున్నాడు. **ఆ లీలా మానుష విగ్రహాన్ని, ఆ బాధ్యతాయుత స్వరూపాన్ని, ఆ మానవాతీత వ్యక్తిత్వాన్ని దర్శనం చేస్తూ, పులకరించి పోతున్నాడు.** ఆ భాష్పాలు ఆ పుస్తకాల కట్టలపైన పడుతున్నాయి. అతడా కట్టలవైపు చూసాడు. ఇవి కదా నా కింతటి పాఠాన్ని చెప్పించాయి. అన్నట్లు ఆదరంతో చూసాడు వాటివైపు అతను, వాటిని చూస్తూ మళ్లీ మాస్టరుగారిని చూస్తూ, మాస్టరుగారిని చూస్తూ మళ్లీ వాటిని చూస్తూ, ఇలా మార్చి మార్చి చూస్తూ అలా అలా అంతర్ముఖుడై పోతున్నాడతను.

**"ప్రేమను కురిసే కన్నులతో చూస్తున్నారు మాస్టరుగారు అతనివైపు తృప్తిగా". – అక్షరాల్లో అనుభూతులు**



# చిరునవ్వులు - చిరుదివ్వెలు

పూజ్యగురుదేవుల హస్తం సహజమైనది, సజీవమైనది, సృజనాత్మకమైనది – సంస్కరణశీలం గలది. వారిలో ఒక అనుష్ఠాన వేదాంతి ఉన్నారు. ఒక దేశభక్తుడు ఉన్నాడు. ఒక బోధకుడున్నాడు. ఒక ఘనవైద్యుడున్నారు. ఒక సాహితీవేత్త ఉన్నారు. ఓ మాటకారి – ఓ చేతల వేదాంతి ఉన్నారు. ఇలా బహుముఖాలుగా వెలుగులు విరజిమ్మే కాంతిపుంజాలు... ఎవరికి తగ్గ వెలుగులు వారికందించేందుకే. గురువుగారి మాటలలో ఏ ఒక్క పలుకునూ కూడా మనం విడిచిపెట్టకూడదని – ఆ 'శ్రద్ధ' మనం వహించిననాడు మానసిక ఉల్లాసాన్ని, విజయపథంలో సాగేందుకు ప్రేరణను కలిగిస్తాయి వారి మాటలు.

ఆ మహనీయుని చూపుమరల్చుకోలేని వదనం ఎందరినో ఆకర్షించింది. ఆకర్షితులైనవారందరికీ మృదుమధురమైన తన వచనాలతో, అత్యంత ఆసక్తిదాయకమైన తన రచనా వ్యాసాంగాలతో సాయితత్త్వసారాన్ని 'ఉగ్గు'గా పట్టి బిడ్డలందరినీ – తల్లిగా, తండ్రిగా ఆదరించి – మనందరికీ, సద్గురువుగా వెలుగొందారు. పురాణేతిహాసాలలోని సార్వకాలీనము, సార్వజనీనము అయిన సందేశాన్ని దేశ, కాల పాత్రలకు అనుగుణంగా మలచి, తనదైన బాణీలో వివరించడం ద్వారా ఆధునికులం – ఆధ్యాత్మికతకు విముఖులం, అని అనుకునే ఈ తరం వారందరినీ ఆశ్చర్యానుభూతులలో ముంచెత్తుతూ ఉత్తేజితులను చేసి కర్తవ్యం వెంట నడిపించారు. తనను రూపుదిద్దిన సాయి అనే దివ్యమూర్తి నుండి బహుధా వ్యక్తమవుతున్న వెలుగునకు వినమ్రుడై అంజలి ఘటిస్తూ సకల మానవాళికి జీవితాన్ని, జీవనాన్ని అందించే ఆ తేజస్సును తన దోసిళ్లతో పట్టి పోశారు. తన చుట్టూ వున్న జీవులను (సమాజానికి) సేద తీరుస్తూ, సేవచేస్తూ, సందేహాలను తొలగించడం దగ్గర నుండి సమస్యలకు పరిష్కారం చూపే వరకు సర్వమూ తానై వెలిగారు. అంతటి గొప్ప మహనీయుడు తనవారితో ఎలా మెలిగారో, వారినెలా నవ్వించారో, ఎలా కవ్వించారో. రకరకాల సన్నివేశాలు, పరిస్థితులు, ఎదురైనపుడు ఎలా స్పందించారో, విభిన్న మనస్తత్త్వాల వారు తమకు చేరువైన వేళ వారితో ఎలా వర్తించారో తెలుసుకోవాలనిపించడం ఎంతో సహజం. సహజమైన ఈ కోరిక తీర్చడానికే మహాత్ముల చరిత్రలు – మనకు సద్గ్రంథాలు, "సాయి దీవెనలు'.

మహనీయుల సందేశం జాతికి ఎంతగా పనికి వస్తుందో, వారి జీవన సరళి కూడా జాతికి అంతగాను పనికి వస్తుంది. అందువల్ల మహనీయుల దివ్య సందేశాన్ని భద్రపరచుకోవడంతోపాటుగా భవ్యమైన వారి జీవన సరళిని, రసవత్తరమైన మార్గంలో మదిలో నిలుపుకునే ప్రయత్నంలో మానవాళి శ్రద్ధ పెట్టవలసి ఉంటుంది. మహనీయుల మనస్సునకు సరసమాడటమనేది ఒక సహజలక్షణంగా



భాషిస్తూ ఉండటం అనాదిగా మానవాళి గమనిస్తూ వస్తున్న అంశమే. మహనీయుల జీవిత సన్నివేశాలను, సంభాషణలను ఒక్కసారి ఈ దృష్టితో పరిశీలించి చూస్తే సరసమన్నది వాటిలో అంతర్లీనంగా తప్పక గోచరిస్తుంది. నవ్వడం – నవ్వించడం, నవ్వుతూ బ్రతకడమెలాగో నేర్పడం వారి జీవిత విధానంలోని ప్రధాన సూత్రంగా మనకు తప్పక గమనికకు వస్తుంది. నిరంతరం ఒత్తిడులకు లోనయ్యే మనస్సును ఆ ఒత్తిడులకు అతీతంగా నిలిపి నడిపించడమెలాగో మానవజాతి వారి దగ్గర నేర్చుకోవలసిందే. **కొద్ది సమస్యలకే సామాన్య మానవులమైన మనం మానసికంగా, ఒత్తిడిపాలైపోతాం. మరి మహనీయులో! వారికి చేరువైన వారందరి జీవితాలు వారివే. అందరి సమస్యలు వారివే. అందరి అవసరాలు వారివే. మరి అలాంటపుడు వారెంతటి ఒత్తిడిని అనుభవించాలి. కాని చిత్రం! వారలా ఒత్తిడిని అనుభవించడం లేదు సరికదా! తాము నవ్వుతూ మనలను నవ్వించి ఇంటికి పంపిస్తున్నారు.**

**– గురుకృప**

### మరో మహాత్ముని సన్నిధిలో జరిగిన మరో హాస్య లీలా విలాసం

## ... మీ ఋణం ఈ జన్మకు ...

“మొన్న మొన్నటి వరకు నాతోపాటు ఇక్కడికి వస్తూ ఉండేవాడు. అతను మీకు తెలుసుకదా! డబ్బులివ్వాలి. తీసుకొని చాలా రోజులైంది. ఎంతకూ ఇవ్వడు. ఎంతకని వేచి ఉండగలను చెప్పండి. కనబడినప్పుడల్లా మాత్రం, మీరు చేసిన సహాయం మరచిపోలేను అంటూ ఏమిటేమిటో చెప్తాడు. అతడి పరిస్థితి నాకేమీ బోధపడటం లేదు” అంటూ క్రింద కూర్చోబడ్డాడు. వయస్సు నలభైదాకా ఉంటాయి. ఆ మాటలు విని స్వామి ఇలా అన్నారు. “ఏమంటున్నాడు మీరు చేసిన సహాయం మరచిపోలేను అంటున్నాడా! ఆ తరువాత ఇంకో వాక్యం కూడా అంటూ ఉండి ఉంటాడు. నీవు సరిగ్గా విన్నావో, లేదో ఆ వాక్యం ఏమిటో తెలుసునా, “మీ మేలు మరచిపోనండి, మీ ఋణం ఈ జన్మకు తీర్చుకోలేను” అని. “నిజమేనండీ ఆ మాట కూడా అంటూనే ఉంటాడతడు. ఏదో మాటవరుసకంటున్నాడనుకున్నాను. ఇదా వరస” అన్నాడతను.

“మరి చెప్పవేం, అతడు స్పష్టంగా చెబుతున్నాడు. మీ ఋణం ఈ జన్మకు తీర్చుకోలేను అని. ఆ మాటవిని కూడా ఇంకా అతను తీర్చడం లేదని బాధపడటంలో అర్థం ఏమిటి చెప్పు. ఇవన్నీ తెలిసే ఒకాయన చెప్పాడు. “సామాన్యంగా ఎవ్వరికీ అప్పు ఇవ్వకు. ఒకవేళ ఇవ్వవలసివస్తే ఈ డబ్బునాది

> మన కోరికలే దుఃఖానికి కారణం అనుకుంటాం, కాని అసలు కారణం – శాంత్యానందాలకు ఏకైక ఆలవాలమైన భగవంతునితో విడివడి ఉండడమే మన దుఃఖాలకు కారణం. భగవంతునితో ప్రగాఢ బాంధవ్యాన్ని మనం ఏర్పరచుకుంటే మన జీవితాల్లో ఆందోళన, అనిశ్చిత, భయం చోటు చేసుకోవు.
>
> *(మూలం : స్వామి చేతనానంద, శ్రీరామకృష్ణ లీలామృతం)*



కాదనుకొని మరీ ఇవ్వు. అప్పుడు అతడు తిరిగి ఇస్తే సంతోషించవచ్చు. ఒకవేళ ఇవ్వకపోయినా బాధ వుండదు. ఈ ప్రిపరేషన్ ముందుగా కనుక నీకు లేకపోతే ఏమవుతుందో తెలుసా? అటు డబ్బు పోవడమే కాక ఇటు లేనిపోని బాధ కూడ కొనితెచ్చుకున్నవాడవవుతావు" అని అన్నారు స్వామి. "ఎవడో కాని బాగా చెప్పారండీ" అన్నాడతను. "ఎవరో ఏముంది? మనలాగానే ఇచ్చి బాగా ధక్కా మక్కీలు తిన్నవాడయి చివరికి లోకం మేలుకోరి ఇలా చెప్పి వుంటాడు. ఇంతకూ ఇప్పుడు నువ్వేం చేస్తావు" అడిగాడు స్వామి. "ఏం చేయమంటారు" అన్నాడతను. "చేయగలిగితే బొడ్లో చేయి వేసి వసూలు చేయి. లేదూ ఇక ఆ ఊసెత్తకు. వాడిస్తే సంతోషించు. లేకపోతే అంతే. ఊరికే మానసికంగా గింజుకోకు. దీనికి కూలెవరిస్తారు చెప్పు", అంటూనే తన పనిలో నిమగ్నమయినారు స్వామి.

* * *

## అందరికీ అనుగ్రహం

భూమి సకాలంలో దున్నినా, సకాలంలో విత్తనాలు వేసినా, మంచి విత్తనాలు జాగ్రత్తగా తెచ్చివేసినా, ఇన్నీ చేసినా, వర్షం సకాలంలో పడితే పండుతుంది. లేకపోతే పండదు. అలాంటిది అనుగ్రహం. అలాంటపుడు యింతోటి దానికి భూమి సకాలంలో దున్నడం ఎందుకు? మంచి విత్తనాలు వేయడం ఎందుకు? అనే ప్రశ్న వేస్తే వర్షం సకాలంలో పడినా, భూమి దున్ని ఉండకపోతే, దున్నినవాడి పొలంలో పంట వస్తుంది. దున్ననివాడి పొలంలో పంటరాదు. కనుక దైవానుగ్రహం అనేది వర్షం లాంటిది, ఎండ లాంటిది, మనం పీల్చే గాలి లాంటిది, మనం త్రాగే నీరు లాంటిది. మనం రెడీగా ఉంటే మన ఇంట్లోకి వస్తుంది. మనం కిటికీలు ఎలా పెట్టుకున్నామో దాన్ని బట్టి యింట్లోకి వచ్చే వెలుతురు భగవదనుగ్రహం వచ్చినపుడు ఇల్లు తిన్నగా కట్టుకుంటే ఇంట్లోకి తిన్నగా వస్తుంది. అనుగ్రహం అందరి మీదా ఒక్కలాగే ఉంటుంది. దేనివల్లనైతే మనందరం పుట్టి పది కాలాలపాటు జీవిస్తున్నామో అది దైవానుగ్రహం. జీవించకుండా ఏదన్నా చంపేస్తే మనం ఎవరిని అడగ్గలం? ఇక్కడ ఉన్న సముద్రం కొండమీదికి పొంగిందనుకోండి. అదేమిటయ్యా భూమ్యాకర్షణకి వ్యతిరేకంగా పొంగిందేమని ఎవరినైనా అడగగలమా? అలా పొంగకూడదని ఏమీ లేదుగా. సముద్రంలోంచి నీళ్ళు కొండకి ఎగబాకేయి అనుకోండి. శాస్త్రం ఒప్పుకోదు. నీళ్ళు పైనుంచే క్రిందకు వెళ్లాలి. ఇట్లా ఎందుకు వచ్చిందని ఎవరిని అడుగుతారు? అవి ఎపుడూ కూడా ఎవరిని ప్రశ్నించే విషయాలు కావు. దైవానుగ్రహం అనేది అందరిమీద పనిచేస్తుంటుంది. దీనికి నిదర్శనమైన కథలు అన్ని పవిత్ర గ్రంథాలలో ఉన్నాయి.

**– ఆచార్య శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్య**

బ్రతికినన్నాళ్లు ఉరుకులు, పరుగులు, బ్రతికేదీ ఎందుకో తెలియదు. చివరకు ఇంతకాలం బ్రతికారనే లెక్క తప్ప, 'జీవించిన' క్షణం అనేది జీవితం మొత్తంలో కనిపించక ఆ దిగులుతోనే కనుమూయడం. ఇదేనా మనం కోరేది. కాదుకాని, మనం పొందుతున్నది మాత్రం ఇదే!



# సద్గ్రంథ పఠనం

బాబా మనకప్పగించిన ఓ ఉపకరణం – సద్గ్రంథపఠనం. ఆ పఠనంలోని పరమార్థాన్ని తెలిపే వైనాలు.. మానవజీవిత గమ్యం ఏమిటో? సాక్షాత్ భగవంతుడైన శ్రీసాయినాథుని తత్త్వమెట్టిదో? అట్టి జీవిత లక్ష్యాన్ని సాధించడానికి మార్గమేమిటో? సద్గురుని ఆవశ్యకత ఎట్టిదో? ఆయన తత్వం ఎంతటిదో తెలిపేది – సద్గ్రంథం.

– నిత్య జీవితంలో మన మనస్థితి ఎలా ఉంచుకోవాలో, జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో, మనం ఎలా నడుచుకోవాలో సద్గ్రంథం బోధిస్తుంది.

– సద్గ్రంథ పఠనమే ఉత్తమమైన ధ్యానం, శ్రవణం, చక్కని స్మరణ, మార్గనిర్దేశకత్వం.

– సశరీరులైన సద్గురునిలో కనబడే లక్షణాలన్నీ ఈ గ్రంథ స్వరూపంలో దర్శనమిస్తాయి. అందుకే సద్గ్రంథం సాక్షాత్ గురుస్వరూపం – సాయి (అక్షర) స్వరూపం.

– సర్వత్రా నిండియున్న 'శ్రీసాయి' మనపై దయతో సచ్చరిత్ర రూపంలో తమను తాము ఇముడ్చుకొని మనకు లభించారు. ఇదే ఆయన సూక్ష్మరూపం. శ్రీసాయి దయకు సాకార రూపం – సచ్చరిత్ర.

నా చరిత్ర ఎక్కడ పారాయణ, శ్రవణం జరుగుతుంటుందో – ఎక్కడ నా నామ స్మరణ జరుగుతుంటుందో అక్కడ నేను సూక్ష్మరూపంలో ఉంటాను అన్న బాబా మాటల పరమార్థం.

బాబాకు, బాబా మాటకు బేధం లేదు. బాబా, బాబా మాట ఒకటే అన్న సత్యం ఎరుకలో ఉంటే పారాయణ, శ్రవణ, మననాదులలో ఆయన స్ఫురణ జరిగి ఆయన సూక్ష్మ స్వరూపాన్ని, తత్త్వ దర్శనాన్ని కాంచగలము.

'వాడ్ని నా లీలలను సేకరించమను, నా చరిత్ర నేనే వ్రాసుకుంటా' అన్నారు బాబా. అలా ఆయన దయా స్వరూపం, కరుణాంతరంగం – శ్రీసాయిసచ్చరిత్ర,

***సత్యం గూర్చిన చరిత్రే – సచ్చరిత్ర అన్నారు ఓ మహాత్ముడు.***

## కందుకూరి వీరేశలింగంగారు

వంద సంవత్సరాల క్రితం ఒక తెలుగు మాస్టారు 'వసుచరిత్ర చదివితే ఇక తెలుగులో ఏ పుస్తకాన్నయినా చదువుకోవచ్చు అన్నారు. తగరగతిలో వున్న పిల్లలందరూ విన్నారు. కాని తలకెక్కించుకోలేదు. కానీ ఒక 14 సంవత్సరాల కుర్రాడు మాత్రం తల్లి తనకు ప్రతి నెలా ఇచ్చే అర్ధరూపాయి డబ్బుతో పుస్తకాల షాప్‌కి వెళ్లాడు. వసుచరిత్ర కావాలన్నాడు. దాని ధర రెండున్నర రూపాయలు. కుర్రాడి దగ్గర

**శ్రద్ధతో చేసే కర్మలన్నీ ఆరాధనలుగా మారతాయి.**



వున్నది అర్ధరూపాయే. అందుకని దుకాణదారునితో 'ప్రతినెలా మా అమ్మ నాకు ఇచ్చే 50 పైసలు తెచ్చి మీకు జమ చేస్తుంటాను. ఐదు నెలలు అలా ఇచ్చిన తరువాతే పుస్తకం మా ఇంటికి తీసుకువెళతాను. అంతవరకు రోజూ ఇక్కడకు వచ్చి చదువుకొని వెళతాను, అనుమతించండి అని ప్రాధేయపడ్డాడు. ఆ దుకాణుదారు మనసు కరిగింది. పుస్తకాన్ని కుర్రాడి చేతిలో పెట్టి డబ్బుకేమీ తొందరలేదు, నీ దగ్గర వున్నప్పుడే ఇవ్వు పుస్తకం తీసుకో అని ఇచ్చాడు. అలా 'వసుచరిత్ర'ను చదివిన ఆ కుర్రాడు ఆ తరువాత తెలుగులో మొదటి జీవిత చరిత్ర వ్రాసాడు. మొదటి నవల వ్రాసాడు. యుగపురుషుడనిపించుకున్నాడు. **ఆయనే కందుకూరి వీరేశలింగంగారు. ఆ ఊరు రాజమండ్రి. *మనిషి మానవత్వాన్ని అక్షరం ప్రేరేపించినట్లు ఇంకేదీ చేయలేదు (క్షరం లేనిది అక్షరం)***

**– సేకరణ : *గురుకృప***

## ... అనుభవ సుధామాలిక ...

### వేద వేద్యుని 'వైద్యం'

బాబా, గురువుగారు నన్ను ఎంతో చక్కగా అనుగ్రహించారు. నాకు మెడిసిన్ చదవాలని కోరికగా వుండేది. కాని కొన్ని కారణాల వల్ల నాకు పరిస్థితులు అనుకూలించలేదు. నాకు శిరిడీ వెళ్లాలని కోరిక చాలా ఎక్కువగా ఉండేది. కనీసం హైదరాబాద్‌లో చదువు కొనసాగిస్తే మా బంధువులతో కలసి శిరిడీ వెళ్లవచ్చు అని అనుకునేవాడిని. అందులోను నేను చదువులో చాలా వెనుకబడి వున్నాను. నేను నిర్మల్ దగ్గరలో వున్న బాబా మందిరంలో బాబాను వేడుకున్నాను. నాకు మెడిసిన్‌లో సీటు ఇప్పించమని. అది హైదరాబాద్‌లో వస్తే శిరిడీ వెళ్లడానికి వీలుగా వుంటుందని. కాని బాబా నా కోరికను మన్నించారు. శిరిడీకి దగ్గరలో వున్న ఔరంగాబాద్‌లో నాకు సీటు ఇప్పించారు. నా సంతోషానికి అవధులు లేవు.

కనీసం దర్శనం చేసుకోలేని నాకు చదువులో వెనకబడిన నాకు మెడిసిన్‌లో సీటు ఇప్పించి, అది శిరిడీ గ్రామానికి దగ్గరలో వున్న ఔరంగాబాద్‌లో. ఇక నేను నాకు సెలవు దొరికినప్పుడల్లా శిరిడీ రావడం, ఆశ్రమానికి రావడం అలా చేస్తున్నాను. ఇది బాబా నాకు ప్రసాదించిన గొప్ప వరం. మా నాన్నగారు ఉద్యోగరీత్యా సస్పెండ్ అయ్యారు. నేను గురువుగారికి చెప్పుకున్నాను. మా నాన్న ఉద్యోగం ఇప్పించమని. మా నాన్నగారికి ఎలాంటి అంతరాయం కలగకుండా ఉద్యోగం వచ్చింది. ఇది గురువుగారు ప్రసాదించిన వరం.

**సాయి సమగ్రదర్శిని : www.saibaba.com**

**సద్గురు తత్త్వ దర్శిని : www.gurukrupa.info**

గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : **gurukrupa@saimail.com**



**దృష్టిమారితే - దృక్పథం మారుతుంది .**



మా చెల్లిని ఎంఎస్సీ కోచింగ్‌లో జాయిన్ చేయడానికి హైదరాబాద్ తీసుకొని వచ్చాను. అయితే మా చెల్లి నాకు గురువుగారి ఫోటో కావాలి అన్నయ్యా! అని అడిగింది. అలా హైదరాబాద్‌కు రాక మునుపు నుండి అడిగింది. సరే నేను శిరిడీ వెళ్లిన తరువాత పంపిస్తాను అని చెప్పాను. కాని సరిగ్గా హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ షాపింగ్ కాంప్లెక్స్ కార్నర్ నుండి కోచింగ్‌సెంటర్‌కు వెళుతున్నాము. రోడ్డుమీద గురువుగారి ఫొటో నాకు కనిపించింది. అది క్రింద పడి వుంది. అనుకోకుండా గురువుగారి ఫొటో కనబడగానే ఆశ్చర్యపోయాను. ఫోటోను తీసుకొని మా చెల్లికి ఇచ్చాను. మా కోరికను మన్నించి గురువుగారు ఆ విధంగా మాకు ఫొటో ఇప్పించారు.

గురువుగారి దయవలన మా గ్రామంలో సత్సంగం ఏర్పాట్లు జరిగాయి. మా సత్సంగం శనివారం రోజున జరుపుతున్నాము. శనివారం రోజున మా గ్రామంలో అంతా వర్షం పడే సూచనగా వుంది. మాకు సత్సంగం ఎలా జరుగుతుందో అని ఆందోళనగా వుంది. ఆరోజు సరిగ్గా సత్సంగం మేము జరుపుకునే సమయానికి వాతావరణం చాలా అనుకూలించింది. సత్సంగం చాలా బాగా జరుపుకున్నాము. ఇలా సత్సంగం రోజున (శనివారం) నాలుగైదుసార్లు జరిగింది. అందరూ అనేవాళ్ళు వర్షం పడుతుంది అని. కాని మేము గురువుగారిమీద భారం వేసాము. కనీసం మాకు టెంట్ కూడా లేదు. డాబా పైన ఆరుబయట సత్సంగం జరుపుకుంటున్నాం. చాలా చక్కగా సత్సంగం జరుపుకుంటున్నాము.

ఎప్పటినుండో మాకు మా గ్రామంలో సత్సంగం ప్రారంభం కావాలని కోరిక వుండేది. గురువుగారి ఆశీస్సుల వలన మాకు లభించింది. మా నిర్మల్ సత్సంగంకు గురువుగారి అనన్యమైన దీవెనలు కావాలని కోరుచున్నాము. అంతకుమునుపు మా బావగారిని స్కూటర్‌మీద కూర్చోబెట్టుకుని మా ఇంటికి వెళు తున్నాను. మా ఇంట దగ్గర మలుపుగా వున్న రోడ్డు వుంది. అది దాటి వెళ్లేటపుడు ఒక వాహనం వెనుకవైపు నుండి వచ్చి మా స్కూటర్‌కు ఢీ కొట్టింది. మా బావ వెంటనే బాబా అని గట్టిగా అరిచాడు. మా స్కూటర్ కొద్దిగా డ్యామేజ్ అయ్యింది. మాకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆ పెద్ద ప్రమాదం నుండి బయటపడ్డాము. నిజానికి ఇది బాబా గారి దీవెనలు.

ఈ కారణాల వెనుక ఎవరు వున్నారని తీవ్రంగా ఆలోచించాను. నాకు బాబా మరియు గురువుగార్ల దీవెనలు వున్నాయని, ఇది నేను ఏ జన్మలో చేసుకున్న ఋణానుబంధమో నాకు గురువుగారు లభించడం. ఇవేకాక, చాలా సందర్భాలలో నన్ను గురువుగారు కాపాడారు. ఆ సద్గురు దేవుని దీవెనలు నాపై లేకుంటే నేను జీవించి వుండే వాడిని కాదు. అంతా ఆయన లీల. నాపై కురిపించిన ఆ ప్రేమ, ఆ దీవెనలు తలచుకుంటే ఏడుపు వస్తుంది. ఎందుకంటే నన్ను ఎందుకు ఇంత ఆలస్యంగా నీ వద్దకు ఈడ్చుకొని వచ్చావు? అని గురువుగారి వద్దనేఉండి పోవాలనిపిస్తుఉంటుంది. ***– ఆర్. ప్రవీణ్‌కుమార్, ఔరంగాబాద్***

# శ్రద్ధ

**భక్తుడు :** బాబా తన భక్తులెవరైనా రెండు రూపాయలు ఇద్దాము అని మనసులో అనుకొని పొరపాటున ఒక రూపాయి ఇవ్వడం మర్చిపోయినా, బాబానే వారికి గుర్తు చేసి మరీ తీసుకునేవారెందుకు?

**గురువుగారు :** ఆ అనుభవం వల్ల బాబా ఆ భక్తుడికి ఏమి చెప్పదలచారు? బాబాకు ఆ రూపాయి ముఖ్యం కాదు. సద్గురువు పట్ల అతని వైఖరి ఎలా ఉంది అనేదే ముఖ్యం. ఆ రూపాయి అడిగి తీసుకోవడంలో బాబా అతనికి ఇచ్చే అనుభవంలో గుణపాఠం - "సద్గురువు పట్ల మనం ఎంతో జాగ్రత్త వహించాలి. ఆయనపట్ల అశ్రద్ధ వహించకూడదు" అని. ఆయన పట్ల మన మనస్సులోని భావనలు కూడా ఆయనకు తెలుసు. ఆయన వాటికి రియాక్ట్ అవుతారు. అందుకే అటువంటి అనుభవాలనిచ్చి బాబా వారిలో ఆ ఎఱుకను పెంచుతారు. ఒకసారి ఆ భక్తుడి స్థానంలో మిమ్మల్ని ఊహించుకుని చూడండి. "నేను ఆయనకు ఒక రూపాయి ఇద్దామని క్యాజువల్‌గా అనుకొని, దాని గురించి మర్చిపోయాను. నేను బాబా దర్శనానికి వెళ్లినపుడు బాబానే దాని గురించి గుర్తు చేసారు" చూశారా! ఎంత జాగ్రత్తగా ఉండాలో, దానినే **శ్రద్ధ** అంటారు. **శ్రద్ధ అంటే ఎఱుక, బాబా పట్ల ప్రేమపూర్వకమైన ఫోకస్, కేర్.**



మానవ దేహంలో కావల్సినంత ఆనందం నిండి ఉంది.
దాన్ని గ్రహింపచేసేది ఆధ్యాత్మికత. అనుభవింప చేసేది
సద్గురువు.. సద్గురు సన్నిధానం..
అట్టి అనుభవం మనిషి
మనసుని వికసింపచేసి తేజోమయుల్ని చేస్తుంది.

-గురుకృప



గురువుని ఆశ్రయించడం... ఆరాధించడం ... ఒక సద్గుణం